


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 342 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : బాపట్ల మంగళవారం 11ఆగస్టు 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 342 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : BAPATLA TUE 11AUGUST 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Bapatla,Ongole,Visakhapatnam,Kakinada,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

## 2027 నాటికి భూముల రీసర్వే పూర్తి చేస్తాం

- ఏలూరు జిల్లా కలిదిండిలో 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమం
- కొత్త పట్టాదారు పాస్‌బుక్కులు పంపిణీ చేసిన సీఎం చంద్రబాబు
- గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూ రికార్డుల తప్పులను సరిదిద్దుతామని వెల్లడి
- బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ, క్యూఆర్ కోడ్‌తో పటిష్ఠమైన భద్రతా ఫీచర్లతో కొత్త పాస్‌బుక్కులు
- రెవెన్యూ సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ఏకైక ఎజెండా అని స్పష్టం



పెన్ పవర్ డెస్క్:రాష్ట్రంలో భూ రికార్డుల ప్రక్షాళనకు శ్రీకారం చుట్టామని, 2027 నాటికి భూముల రీసర్వే ప్రక్రియను పూర్తి చేసి, ప్రభుత్వ అధికారిక చిహ్నంతో కూడిన పట్టాదారు పాస్‌బుక్కులను రైతులకు, భూ యజమానులకు అందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. రెవెన్యూ సంబంధిత సమస్యలను పరిష్కరించడమే తమ కూటమి ప్రభుత్వ ఏకైక ఎజెండా అని ఆయన పునరుద్ఘాటించారు. సోమవారం ఏలూరు జిల్లా, కైకలూరు నియోజకవర్గంలోని కలిదిండిలో జరిగిన 'మీ భూమి--మీ హక్కు' పట్టాదారు పాస్‌బుక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నల్లజర్ల దుర్గాభవాని అనే మహిళా రైతుకు అధికారిక చిహ్నంతో కూడిన కొత్త పట్టాదారు పాస్‌బుక్‌ను అందజేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో సీఎం మాట్లాడుతూ.. కేంద్రంలో, రాష్ట్రంలో ఉన్న డబుల్ ఇంజిన్ ప్రభుత్వం బుల్లెట్ వేగంతో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తోందన్నారు. రెండో ప్రపంచ యుద్ధంలో పాల్గొన్న మాజీ సైనికులకు కేటాయించిన

- మిగతా 2లో



## దైవ నామాలను అపహాస్యం చేయొద్దు

- గోవింద నామాలను పేరడీ చేయడంపై పవన్ కల్యాణ్ ఆగ్రహం
- నెల్లూరులో ఓ పార్టీ చర్యను తీవ్రంగా ఖండించిన జనసేనాని
- భక్తుల మనోభావాలను కించపరిచే కుట్రపూరిత చర్యగా అభివర్ణన
- ఈ ఘటనపై చట్టపరంగా ముందుకెళ్లాలని పార్టీ నేతలకు ఆదేశం
- దైవ నామాలను అపహాస్యం కోసం వాడొద్దని హితవు

పెన్ పవర్ డెస్క్:దైవ నామాలను, భక్తి గీతాలను రాజకీయ ప్రయోజనాల కోసం పేరడీలుగా మార్చి అపహాస్యం చేయడాన్ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ తీవ్రంగా ఖండించారు.

- మిగతా 2లో

## ఆగస్టు 17 నుంచి ఏపీ అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు...

### ఈసారి కూడా వైసీపీ గైర్హాజరు?




- ఆగస్ట్ 17 నుంచి ఏపీ శాసనసభ వర్షాకాల సమావేశాలు
- ప్రతిపక్ష హోదా ఇవ్వనందున అసెంబ్లీకి దూరంగా ఉండనున్న వైసీపీ
- శాసనమండలి సమావేశాలకు మాత్రం హాజరుకానున్న విపక్షం
- మండలిలో మెగా డీఎస్సీ అక్రమాలపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు వ్యూహం
- హైకోర్టులో విచారణ దశలో ప్రతిపక్ష హోదా అంశం

- మిగతా 2లో

## 22-ఏ సమస్యకు తక్షణ పరిష్కారం.. 830 కుటుంబాలకు సీఎం చంద్రబాబు ఊరట

- కలిదిండిలో 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో సీఎం చంద్రబాబు
- 22-ఏ జాబితాలో భూములపై రైతులు, మాజీ సైనికుల ఫిర్యాదు
- జాబితా నుంచి భూములను తొలగించాలని కలెక్టర్‌కు తక్షణ ఆదేశం
- 830 కుటుంబాలకు చెందిన 2,745 ఎకరాలకు విముక్తి
- లబ్ధిదారులకు 1-బి అడంగల్ పత్రాలు అందజేసిన ముఖ్యమంత్రి



పెన్ పవర్ డెస్క్:ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న తీవ్రమైన భూ సమస్యకు ముఖ్యమంత్రి చంద్రబాబు తక్షణ పరిష్కారం చూపారు. సోమవారం ఆయన ఏలూరు జిల్లా, కైకలూరు నియోజకవర్గం పరిధిలోని కలిదిండిలో 'మీ భూమి--మీ హక్కు'

- మిగతా 2లో

## పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

- డీఎస్సీలో అక్రమాలు జరిగాయంటూ వైసీపీ నిరసన దీక్షలు
- తాడిపత్రికి వెళుతున్న పెద్దిరెడ్డి, అనంత వెంకట్రామిరెడ్డిలను అడ్డుకున్న పోలీసులు
- ఇద్దరినీ అదుపులోకి తీసుకుని అనంతపురంకు తరలించిన పోలీసులు



పెన్ పవర్ డెస్క్:డీఎస్సీలో అక్రమాలు జరిగాయంటూ రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ నిరసన ర్యాలీలకు పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. ఈ నిరసనల్లో పాల్గొనేందుకు అనంతపురం జిల్లా తాడిపత్రికి వెళ్తున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆ పార్టీ జిల్లా

- మిగతా 2లో



## కొలంబియాలో భారీ భూకంపం.. రిక్టర్ స్కేల్‌పై 7.4 తీవ్రత నమోదు.. 20 మంది మృతి

పెన్ పవర్ డెస్క్: కొలంబియాలో భారీ భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై భూకంప తీవ్రత 7.4గా నమోదు అయ్యింది. ఈ ఘటనలో కనీసం 20 మరణించగా.. పలువురు భవన శిథిలాల కింద చిక్కుకున్నట్లు అధికారులు తెలిపారు. యూఎస్ జియోలాజికల్ సర్వే

- మిగతా 2లో

## తెలుగు అమ్మాయిలతో స్కెచ్.. ఢిల్లీ కేంద్రంగా భారీ మోసం గుట్టురట్టు!




- ఢిల్లీలోని ఫేక్ కాల్ సెంటర్లపై తెలంగాణ సైబర్ బ్యూరో దాడులు
- తెలుగు మాట్లాడే యువతులనే టెలీకాలర్లుగా నియమించుకున్న కేటుగాళ్లు
- లోన్ల పేరుతో మోసం, 21 మంది యువతులతో పాటు వ్యక్తి అరెస్టు
- ప్రధాన సూత్రధారులు పరారీ, కొనసాగుతున్న దర్యాప్తు

పెన్ పవర్ డెస్క్:ఢిల్లీ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న మూడు మోసపూరిత కాల్ సెంటర్లపై తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. బజాజ్ ఫైనాన్స్ పేరుతో రుణాలు ఇస్తామని నమ్మించి మోసాలకు పాల్పడుతున్న ఈ ముఠాకు సంబంధించి 22 మందిని

- మిగతా 2లో



## ఝార్ఖండ్‌లో టెన్షన్.. బారికేడ్లు బద్దలుకొట్టిన విద్యార్థులు.. వాటర్ కేనన్‌ల ప్రయోగం

- ఝార్ఖండ్‌లో విద్యార్థుల ఆందోళన ఉద్రిక్తం
- బారికేడ్లు దాటి అసెంబ్లీ వైపు విద్యార్థుల మార్చ్
- అడ్డుకునేందుకు వాటర్ కేనన్లు ప్రయోగించిన పోలీసులు
- పేపర్ లీక్‌లపై సీబీఐ దర్యాప్తు కోరుతున్న విద్యార్థులు
- 13 పరీక్షలను రద్దు చేయాలని డిమాండ్

పెన్ పవర్ డెస్క్:ఉద్యోగ నియామక పరీక్షల్లో పేపర్ లీక్‌లకు వ్యతిరేకంగా ఝార్ఖండ్‌లో విద్యార్థుల ఆందోళన ఉద్రిక్తంగా మారింది. రాంచీలో అసెంబ్లీ వైపు వెళ్లేందుకు విద్యార్థులు బారికేడ్లను దాటడంతో పోలీసులు వాటర్ కేనన్లు ప్రయోగించారు. అయినా కొందరు విద్యార్థులు నృత్యాలు చేస్తూ ముందుకు కదలడం వీడియోల్లో కనిపించింది. నియామక పరీక్షల్లో అక్రమాలు, పేపర్ లీక్‌లతో తమ భవిష్యత్తు దెబ్బతింటోందని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యలకు పరిష్కారం చూపాలని కోరుతూ సోమవారం వేలాది మంది రాంచీకి తరలివచ్చారు. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి రైళ్లు, బస్సులు, ఇతర వాహనాల్లో రాజధానికి చేరుకున్నారు.అసెంబ్లీ ముట్టడికి బయలుదేరే ముందు విద్యార్థి నేత దేవేంద్ర మహతో కీలక సూచన చేశారు. పోలీసులు అడ్డుకున్నప్పుడు వారితో వాగ్వాదానికి దిగొద్దని కోరారు. క్రమశిక్షణతో మరో మార్గం ద్వారా

- మిగతా 2లో




## పన్నెండేళ్లలో రూ.10 లక్షల కోట్ల కార్పొరేట్ రుణాలు మాఫీ

పెన్ పవర్ డెస్క్:కార్పొరేట్ రుణాలు అంటే తెలిసే ఉంటుంది. పెద్దపెద్ద ప్రైవేటు కంపెనీలకు బ్యాంకులు ఇచ్చిన రుణాలు. గత పన్నెండేళ్లలో బ్యాంకులు మాఫీ చేసిన కార్పొరేట్ రుణాలు 9 లక్షల 95 వేల కోట్ల రూపాయలు. అంటే దాదాపు పది లక్షల కోట్లు. కార్పొరేట్ లోన్స్ రైట్ ఆఫ్ లెక్కలు కేంద్ర ప్రభుత్వం 2026 ఆగస్టు 10న పార్లమెంటుకు తెలిపింది. కార్పొరేట్ రుణాలు మాఫీపై మాట్లాడుతూ.. పూర్తిగా రద్దు చేసనట్లు కాదని..

- మిగతా 2లో

## పన్నుల బిల్లుకు పార్లమెంట్ ఆమోదం..

### యూపీఐ ఛార్జీలపై నిర్మలా సీతారామన్ కీలక ప్రకటన

- పన్నుల సవరణ బిల్లు 2026కు పార్లమెంట్ ఆమోదం
- యూపీఐ లావాదేవీలపై వినియోగదారులకు ఛార్జీలు లేవని నిర్మలా సీతారామన్ స్పష్టీకరణ
- మర్చంట్ డిస్కౌంట్ రేట్‌పై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదన్న కేంద్రం
- భవిష్యత్తులో ఛార్జీలు వచ్చినా వ్యాపారులకే, అదీ పెద్ద లావాదేవీలకే వర్తింపు
- రోజువారీ కొనుగోళ్లు 90 శాతం ఉచితంగానే కొనసాగుతాయని వెల్లడి



పెన్ పవర్ డెస్క్:యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) లావాదేవీలపై వినియోగదారు లకు ఎటువంటి ఛార్జీలు లేదా పన్నులు విధించే ఉద్దేశం లేదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సోమవారం పార్లమెంటులో స్పష్టం చేశారు. పన్నుల, ఇతర చట్టాల (సవరణ) బిల్లు 2026కు పార్లమెంట్ ఆమోదం

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# జగన్ వర్సెస్ పవన్... ఎపుడు ఎక్కడ ?

ఏపీ రాజకీయాలు క్షుణ్ణంగా పరిశీలిస్తే కూటమిలో పెద్దన్న అయిన టీడీపీతోనే వైసీపీ ఢీ కొడుతోంది. అందులో రెండవ పెద్ద పార్టీ మిత్రపక్షంగా ఉన్న జనసేన ఊరు తలవడం లేదు, ఇక బీజేపీ గురించి వైసీపీ పెద్దగా ఎపుడూ మాట్లాడింది లేదు, విమర్శలు చేసింది లేదు అనే అంటారు. మరి వైసీపీ ఈ రకంగా వ్యూహ రచన చేయడం వెనక కారణాలు ఏమిటి అన్న చర్చ సాగుతోంది. నిజానికి వైసీపీని కూటమిలోని మూడు పార్టీలూ కలసి కట్టుగా ఓడించాయి. ఏదైనా విమర్శ చేయాల్సి వస్తే మూడు పార్టీలూ గట్టిగానే చేస్తాయి. ఏ మాత్రం స్పేర్ చేయవు కూడా. కానీ వైసీపీ మాత్రం కూటమిలోని పార్టీలను ఎంచుకుని మరీ తమ రాజకీయ విమర్శలకు పదును పెడుతోంది.

**జనసేనతో ఎందుకలా :**

ఇక జనసేన విషయానికి వస్తే ఎందుకో వైసీపీ ఈ మధ్య పెద్దగా స్పందించడం లేదు. బహుశా 2024 కి ముందు అధికారంలో ఉన్నపుడు పవన్ ని గట్టిగా టార్గెట్ చేసి ఆ సామాజిక వర్గం ఆగ్రహానికి గురి అయ్యామన్న ముందు జాగ్రత్త కాబోలు అని అంటున్నారు. అంతే కాదు ప్రభుత్వంలో పెద్దన్నగా టీడీపీ ఉందని ఆ పార్టీ నిర్ణయాలే అమలు అవుతున్నాయని అందువల్ల జనసేనను ఊరకే అని నాలుగు తిని ఆ పార్టీతో పెట్టుకోవడం ఎందుకొచ్చినది అన్న రాజకీయ తెలివిడితో కూడా ఈ విధంగా వ్యవహరిస్తున్నారు అని అంటున్నారు.

**వారి మంత్రుల మీద :**

అంతే కాదు జనసేన మంత్రుల శాఖ మీద కూడా వైసీపీ ఇప్పటిదాకా విమర్శలు చేసింది లేదు, పవన్ చేతిలో అయిదు శాఖలు ఉన్నాయి. అలాగే నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్ కూడా కీలక శాఖలనే చూస్తున్నారు. అయితే వైసీపీ మాత్రం ఈ శాఖల జోలికి ఏ మాత్రం పోవడం లేదు, మరో వైపు ఈ శాఖలలో ఆ మంత్రులు బాగానే పనిచేస్తున్నారు అని అంటున్నారు. దాంతో కూడా జనసేన వైపే వైసీపీ చూడడం లేదని అంటోంది. అదే ఏ చిన్న తప్పు జరిగినా టీడీపీ మంత్రుల శాఖల మీద మాత్రం రాజకీయ రాద్ధాంతం చేస్తోంది అని గుర్తు చేస్తున్నారు. అంటే వైసీపీ ఒక వైపే చూస్తోంది అని అంటున్నారు.

**వ్యూహాత్మకంగానే :**

జనసేనను వైసీపీ ఈ విధంగా పక్కన పెట్టడం వెనక రాజకీయ వ్యూహాలే ఉన్నాయని అంటున్నారు. 2024 ఎన్నికలు వేరు, 2029 ఎన్నికలు వేరు అని అంటున్నారు. రాజకీయాల్లో ఎపుడేమి జరుగుతుందో ఎవరికీ తెలియదు అని అంటారు. అందువల్ల తమ శాశ్వత ప్రత్యర్థిగా టీడీపీనే వైసీపీ ఎంచుకుంది అని అంటున్నారు. టీడీపీ అంటే ఒంటి కాలు మీద వైసీపీ లేస్తుంది. మిగిలిన కూటమి పార్టీల మీద ఆ స్పీడ్ అసలు చూపించడం లేదు అంటే అది పక్కా రాజకీయ ఎత్తుగడగానే చూస్తున్నారు. గతంలో వైసీపీ ఈ విధంగా వ్యవహరించలేదు అని కూడా అంటున్నారు. ఒకేసారి ఒకరిని మించి ఎక్కువ మంది ప్రత్యర్థులను తయారు చేసుకుని వారందరినీ అనేస్తూ వారి నుంచి వచ్చే విమర్శల జడివానలో తడిసిపోతూ ఉక్కిరిబిక్కిరి అయ్యేదని చెబుతున్నారు.

**ఇప్పట్లో ఉందా లేదా :**

ఈ క్రమంలో జగన్ ఎక్కడికి బహిరంగ సభలు నిర్వహించినా లేదా పర్యటనలు చేసినా మీడియా మీటింగ్స్ పెట్టినా చంద్రబాబు లోకేష్ ల మీదనే గట్టిగా ఫోకస్ పెడుతున్నారు. గతంలో మాదిరిగా పవన్ ని దత్తపుత్రుడు ట్యాగ్ పెట్టి విమర్శలు అయితే చేయడం లేదు, మరి జగన్ ఒకటి అంటే అటు నుంచి కూడా రీ సౌండ్ వస్తుంది. అలా జగన్ వర్సెస్ పవన్ అన్నట్లుగా ఏపీ రాజకీయం హీటెక్కడం ఖాయం. కానీ అది మాత్రం ఇటీవల కాలంలో జరగడం లేదు, ఇంతకీ అలాంటి సందర్భం వస్తుందా లేదా ఇక వైసీపీ కొత్త వ్యూహాలలో భాగంగా ఇదంతా అలా సాగిపోతుందా అంటే వేచి చూడాల్సిందే అని అంటున్నారు.

# 2027 నాటికి భూముల రీసర్వే పూర్తి చేస్తాం

- మొదటి పేజి తరువాయి

భూములను సెక్షన్ 22–ఏ పరిధిలో పెట్టి ఇబ్బందులకు గురిచేస్తే, తమ ప్రభుత్వం ఆ సమస్యను పరిష్కరించి వారికి పట్టాలు అందించిందని గుర్తుచేశారు.

**గత ప్రభుత్వ వైఫల్యాలపై విమర్శలు**

2019–2024 మధ్య గత ప్రభుత్వ హయాంలో జరిగిన విధ్వంసం రెవెన్యూ రికార్డులను తీవ్రంగా దెబ్బతీసిందని చంద్రబాబు ఆరోపించారు. భూములు, ఆస్తులను డిజిటల్‌గా 22–ఏ పరిధిలోకి తెచ్చి వివాదాలు సృష్టించారని మండిపడ్డారు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే భూ సమస్యలపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు వెల్లువెత్తాయని తెలిపారు. ఈ నేపథ్యంలో భూ రికార్డులను శుభ్రపరిచి, క్రమబద్ధీకరించేందుకు 'రెవెన్యూ రికార్డ్స్ రిఫార్మ్స్ 2026'ను ప్రవేశపెట్టినట్లు వివరించారు.

**పటిష్ఠ భద్రతతో కొత్త పాస్‌బుక్కులు**

కొత్తగా జారీ చేస్తున్న పట్టాదారు పాస్‌బుక్కులలో కరెన్సీ నోట్లకు వినియోగించే తరహాలోనే పటిష్ఠమైన భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నామని సీఎం తెలిపారు. ఆస్తుల వివరాలను మార్చేందుకు వీలులేకుండా బ్లాక్‌చెయిన్ టెక్నాలజీని, దీనికి అదనంగా క్యూఆర్ కోడ్ వంటి సాంకేతిక భద్రతా ఫీచర్లను పొందుపరిచామన్నారు. రైతుల సమక్షంలోనే రీసర్వే నిర్వహిస్తూ, వారి ఈ–కేవైసీ తీసుకున్నాకే గ్రామసభలు పెట్టి పారదర్శకంగా పాస్‌బుక్కులు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు 32.22 లక్షల పట్టాదారు పాస్‌బుక్కులు రైతులకు, భూ యజమానులకు అందజేశామని, రాబోయే ఏడు నెలల్లో 9,365 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసి 68.64 లక్షల పాస్‌బుక్కులు జారీ చేస్తామని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు దాదాపు 41,000 ఎకరాలకు సంబంధించిన భూ సమస్యలను పరిష్కరించడం ద్వారా 1.27 లక్షల మంది రైతులకు, పరిశ్రమలకు, ప్రజలకు లబ్ధి చేకూర్చామన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, నిబంధనలు ఉల్లంఘిస్తే వారు సొంత పార్టీ వారైనా ఉపేక్షించేది లేదని గుంటూరు ఘటనను ఉదాహరణగా చూపిస్తూ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రైతులకు ట్రాక్టర్లను పంపిణీ చేసి, ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను సీఎం సందర్శించారు.

# దైవ నామాలను అపహాస్యం చేయొద్దు

- మొదటి పేజి తరువాయి

తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి పవిత్ర నామాలను కించపరచడం దారుణమని ఆయన పేర్కొన్నారు. భక్తుల మనోభావాలను దెబ్బతీసే ఇలాంటి చర్యలను ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. నెల్లూరు నగరంలో చోటుచేసుకున్న ఓ ఘటనను ఆయన ప్రస్తావించారు. కనీసం ప్రతిపక్ష హోదా కూడా లేని ఓ రాజకీయ పార్టీ, తమ కార్యక్రమాల్లో పవిత్రమైన గోవింద నామాలను పేరడీగా వాడుకోవడం భక్తుల మనోభావాలను తీవ్రంగా గాయపరిచిందని అన్నారు. ఆ కార్యక్రమంలో పాల్గొన్న వారి తీరు ధార్మిక విశ్వాసాలకు విఘాతం కలిగించేలా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది కేవలం అపహాస్యం చేయడమే కాదని, మతపరమైన విద్వేషాలను రెచ్చగొట్టే కుట్రపూరిత ఆలోచన అని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని జనసేన పార్టీ శ్రేణులకు పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారు. ధార్మిక విశ్వాసాలతో ముడిపడిన అంశాలను చులకన చేసే ఇలాంటి చర్యలను సహించకూడదని స్పష్టం చేశారు.

రాజకీయాలతో సంబంధం లేకుండా ఎవరూ కూడా దైవ నామాలు, మంత్రాలు, స్తోత్రాలను అపహాస్యం చేసేందుకు వినియోగించవద్దని ఆయన హితవు పలికారు. భక్తికి సంబంధించిన పవిత్రమైన విషయాలను గౌరవించడం అందరి బాధ్యత అని ఆయన సూచించారు. ఈ మేరకు జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది.

# ఆగస్టు 17 నుంచి ఏపీ అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు...

ఆంధ్రప్రదేశ్ శాసనసభ వర్షాకాల సమావేశాలు ఆగస్టు 17 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్ సోమవారం నోటిఫికేషన్ జారీ చేశారు. అయితే, ప్రతిపక్ష హోదా వివాదం నేపథ్యంలో ఈ సమావేశాలకు దూరంగా ఉండాలని వైసీపీ యోచిస్తున్నట్లు తెలుస్తోంది. నోటిఫికేషన్ ప్రకా రం, ఆగస్టు 17న ఉదయం 9 గంటలకు శాసనసభ, ఉదయం 10 గంటలకు శాసనమండలి సమావేశాలు ప్రారంభమవుతాయి. 2024 ఎన్నికల్లో కేవలం 11 స్థానాలకే పరిమితమైన వైసీపీకి ప్రతిపక్ష నేత (ఎల్ఓపీ) హోదా ఇచ్చేందుకు ప్రభుత్వం నిరాకరించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, తమ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్‌కు ఎల్ఓపీ హోదా కల్పించనంత వరకు అసెంబ్లీకి హాజరయ్యే ప్రసక్తే లేదని ఆ పార్టీ ఇప్పటికే స్పష్టం చేసింది. ప్రజల గొంతుకను బలంగా వినిపించాలంటే ప్రతిపక్ష హోదా తప్పనిసరి అని, ప్రజాస్వామ్యాన్ని గౌరవించకపోవడం వారి అవివేకమే అవుతుందని జగన్ గతంలో వ్యాఖ్యానించారు. ఈ హోదాకు సంబంధించిన అంశం ప్రస్తుతం హైకోర్టులో విచారణ దశలో ఉంది. అయితే, అసెంబ్లీకి దూరంగా ఉన్నప్పటికీ శాసనమండలి సమావేశాలకు మాత్రం హాజరు కావాలని వైసీపీ నిర్ణయించింది. మండలిలో తమకు పూర్తి మెజారిటీ ఉండటంతో, వివిధ ప్రజా సమస్యలపై ఎన్డీఏ ప్రభుత్వాన్ని నిలదీసేందుకు సిద్ధమవుతోంది. ముఖ్యంగా, మెగా డీఎస్సీ–2025లో చోటుచేసుకున్నాయని ఆరోపిస్తున్న అక్రమాలపై మండలిలో గళం విప్పనుంది.

ఈ అంశంపై తక్షణమే సీబీఐ విచారణ జరపాలని, పారదర్శక దర్యాప్తు కోసం విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ రాజీనామా చేయాలని వైసీపీ డిమాండ్ చేస్తోంది. అయితే, తాము డీఎస్సీ పరీక్షను రద్దు చేయాలని గానీ, ఇప్పటికే నియామకమైన అభ్యర్థులను తొలగించాలని గానీ కోరడం లేదని వైసీపీ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి స్పష్టం చేశారు. అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి, అర్హులైన అభ్యర్థులకు న్యాయం చేయడమే తమ లక్ష్యమని ఆయన వివరించారు. దీంతో ఈ వర్షాకాల సమావేశాలు వాడివేడిగా జరిగే అవకాశం కనిపిస్తోంది.

# 22-ఏ సమస్యకు తక్షణ పరిష్కారం.. 830 కుటుంబాలకు సీఎం చంద్రబాబు ఊరట

- మొదటి పేజి తరువాయి

కార్యక్రమం కోసం విచ్చేశారు. ఈ సందర్భంగా, తమ భూములు 22–ఏ నిషేధిత జాబితాలో చేరడంతో ఇబ్బందులు పడుతున్నామని పలువురు రైతులు, మాజీ సైనికులు సీఎం దృష్టికి తీసుకురాగా, వాటిని తక్షణమే ఆ జాబితా నుంచి తొలగించాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. వివరాల్లోకి వెళితే, సోమవారం కలిదిండి తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ఈ సమావేశంలో బాధితులు తమ గోడును వెళ్లబోసుకున్నారు. తమకు హక్కుగా సంక్రమించిన భూములను 22–ఏ జాబితాలో చేర్చడం వల్ల రిజిస్ట్రేషన్లు చేసుకోలేక, అమ్ముకోలేక తీవ్రంగా నష్టపోతున్నామని ముఖ్యమంత్రికి వివరించారు. వారి సమస్యలను సావధానంగా విన్న చంద్రబాబు, ప్రజలకు మేలు చేసేలా అక్కడికక్కడే నిర్ణయం తీసుకున్నారు.

సీఎం ఆదేశాలతో ఉనికిలి, కలిదిండి, వైవాక గ్రామాలకు చెందిన 830 కుటుంబాలకు భారీ ఊరట లభించింది. వారికి సంబంధించిన 2,745 ఎకరాల భూములను 22–ఏ జాబితా నుంచి తొలగించే

ప్రక్రియకు మార్గం సుగమమైంది. డీనోటిఫికేషన్ అధికారాలను ఆర్డీఓకు కల్పించాలని కూడా ఈ సందర్భంగా సీఎం సూచించారు. అనంతరం, సమస్య పరిష్కారానికి గుర్తుగా లబ్ధిదారులకు 1–బి అడంగల్ ప్రతులను చంద్రబాబు స్వయంగా అందజేశారు. దశాబ్దాలుగా నలుగుతున్న తమ సమస్యకు ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు వెంటనే పరిష్కారం చూపడంతో రైతులు, బాధితులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు ముఖ్యమంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# కొలంబియాలో భారీ భూకంపం.. రిక్టర్ స్కేల్‌పై 7.4 తీవ్రత నమోదు.. 20 మంది మృతి

- మొదటి పేజి తరువాయి

ప్రకారం.. సోమవారం (ఆగస్టు 10) కొలంబియా రాజధాని బొగోటాకు పశ్చిమాన దాదాపు 250 మైళ్ల (400 కిలోమీటర్ల) దూరంలో ఉన్న శాన్ జోస్ డెల్ పాల్మార్ అనే గ్రామంలో ఈ భారీ భూకంపం సంభవించింది. ఈ భూకంప కేంద్రం భూమికి 107 కిలోమీటర్ల లోతులో కేంద్రీకృతమై ఉన్నట్లు తెలిపింది. ఒక్కసారిగా భూమి కంపించడంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురై ఇళ్లు, కార్యాలయాల నుంచి బయటకు పరుగులు తీశారు. శక్తివంతమైన ప్రకంపనల ధాటికి పలు చోట్ల భారీ భవనాలు నేలమట్టమయ్యాయి. దీంతో పలువురు శిథిలాల కింద ప్రజలు చిక్కుకుపోగా పలువురు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే అత్యవసర సహాయక బృందాలు రెస్క్యూ ఆపరేషన్ చేపట్టాయి. ప్రజలను భూకంప ప్రభావిత ప్రాంతాలను నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

ఈ ఘటనలో ఇప్పటి వరకు 20 మందికి పైగా మరణించగా.. పదుల సంఖ్యలో ప్రజలు గాయపడ్డారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రాణ, ఆస్తి నష్టానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ భూకంప ప్రభావం కొలంబియా పొరుగు దేశమైన ఈక్వెడార్‌లో కూడా కనిపించింది. ఈక్వెడార్ లో కూడా పలు ప్రాంతాల్లో భూమి స్వల్పంగా కంపించింది.

# ఝార్ఖండ్‌లో టెన్షన్.. బారికేడ్లు బద్దలుకొట్టిన విద్యార్థులు.. వాటర్ కేనన్‌ల ప్రయోగం

- మొదటి పేజి తరువాయి

అసెంబ్లీకి చేరేందుకు ప్రయత్నించాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల మార్చ్ నేపథ్యంలో రాంచీలో పోలీసులు భారీగా మోహరించారు. ప్రధాన కూడళ్లు, కీలక ప్రాంతాల్లో బారికేడ్లు ఏర్పాటు చేశారు. జిల్లా సరిహద్దులు, ప్రధాన రహదారులు, హైవేలపై బస్సులు, ప్రైవేటు వాహనాలను తనిఖీ చేశారు. నగరంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా భారీ భద్రత ఏర్పాటు చేశారు. రాంచీలో చాలా పాఠశాలలకు సోమవారం సెలవు ప్రకటించారు.

**16 రోజులుగా ఆందోళన**

ఝార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్, ఝార్ఖండ్ స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ నిర్వహించిన నియామక పరీక్షల్లో పేపర్ లీక్‌లు, అక్రమాలు జరిగాయని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. 13 పరీక్షలను రద్దు చేసి సీబీఐ దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వంతో ఇప్పటికే ఆరు దఫాలుగా చర్చలు జరిగినా పరిష్కారం కాలేదు. తమ డిమాండ్లలో 98 శాతం అంగీకరించామని ప్రభుత్వం చెబుతోంది. అయితే 13 పరీక్షల్లో కేవలం మూడింటినే రద్దు చేసేందుకు ప్రభుత్వం అంగీకరించిందని విద్యార్థులు అంటున్నారు. ఆందోళనలో భాగంగా ఆరుగురు విద్యార్థులు నిరాహార దీక్ష కొనసాగిస్తున్నారు.

## పన్నెండేళ్లలో రూ.10 లక్షల కోట్ల కార్పోరేట్ రుణాలు మాఫీ

- మొదటి పేజి తరువాయి

రికవరీ కొనసాగుతుందని పేర్కొంది. 2018–19లో అత్యధికంగా లక్షా 48 వేల 753 కోట్ల రుణాలను మాఫీ చేసినట్లు తెలిపింది. 2025–26 ఆర్థిక సంవత్సరానికి 20 వేల 485 కోట్ల రూపాయలు మాఫీ చేసినట్లు ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌధరీ రాతపూర్వకంగా పార్లమెంటుకు తెలిపారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రకారం.. పెద్ద పరిశ్రమలకు ఔట్ స్టాండింగ్ లోన్లు 2025 ఆర్థిక సంవత్సరానికి 63 లక్షల19 వేల 57 కోట్ల రూపాయలు ఉండగా.. 2026 ఆర్థిక సంవత్సరానికి 69 లక్షల 21 వేల 734 కోట్ల రూపాయలకు పెరిగినట్లు తెలిపారు. మాఫీ అనేది అకౌంటింగ్ ప్రొసీజర్ మాత్రమేనని.. రుణ గ్రహీత కంపెనీలకు అది ఎలాంటి ఉపశమనం కాదని పేర్కొన్నారు. కార్పోరేట్ లోన్ల విషయంలో ఎన్డీఏ ప్రభుత్వంపై ఇప్పటికే విమర్శలు వస్తూనే ఉన్నాయి. మోదీ పగ్గాలు చేపట్టాక కార్పోరేట్ రుణాల మాఫీ ఎక్కువగా ఉందని పలు మార్లు ప్రతిపక్షాలు విమర్శలు చేసిన విషయం గమనార్హం. సామాన్యుల లోన్ల విషయంలో ముక్కు పిండి వసూళ్లు చేసే బ్యాంకులు.. కార్పోరేట్ల విషయంలో ఎందుకు ఉదాసీనత వహిస్తున్నాయనే ప్రశ్నలు వెల్లువెత్తుతూనే ఉన్నాయి.

## పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

- మొదటి పేజి తరువాయి

అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డిలను పోలీసులు ముచ్చుకోట వద్ద అడ్డుకున్నారు. తాడిపత్రికి వెళ్లేందుకు అనుమతి లేదని వీరికి పోలీసులు స్పష్టం చేశారు. ఈ క్రమంలో, పోలీసుల తీరును నిరసిస్తూ వైసీపీ నేతలు అక్కడే బైఠాయించారు. దీంతో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, అనంత వెంకటరామిరెడ్డిలను అదుపులోకి తీసుకుని పోలీసులు... వారిని అక్కడి నుంచి అనంతపురంకు తరలించారు.

## తెలుగు అమ్మాయిలతో స్కెచ్.. ఢిల్లీ కేంద్రంగా భారీ మోసం గుట్టురట్టు!

- మొదటి పేజి తరువాయి

అదుపులోకి తీసుకున్నారు. వీరిలో 21 మంది తెలుగు యువతులు, ఒక బ్యాంకు ఖాతాదారుడు ఉన్నారు.

గత 18 నెలలుగా ఈ ముఠా చురుకుగా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. బజాజ్ ఫైనాన్స్ ప్రతినిధులుగా ఫోన్లు చేసి, ఆకర్షణీయమైన రుణాలను ఆమోదించినట్లు నమ్మించేవారు. ఆ తర్వాత ప్రాసెసింగ్ ఫీజులు, వెరిఫికేషన్ చార్జీలు, డాక్యుమెంటేషన్, ఇన్సూరెన్స్ వంటి పేర్లతో బాధితుల నుంచి డబ్బులు వసూలు చేసేవారు. ఈ మోసాలకు పాల్పడేందుకు నిర్వాహకులు ప్రత్యేకంగా తెలుగు మాట్లాడే యువతులనే నియమించుకున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. తెలంగాణలోని జగిత్యాల జిల్లా కోరుట్ల, హైదరాబాద్‌లోని సైదాబాద్, బోరబండ, మహబూబ్‌నగర్ ప్రాంతాల నుంచి యువతులను టెలీకాలర్లుగా రిక్రూట్ చేసుకున్నారు. లలిత్ సింగ్, కుల్దీప్ సింగ్, అనిల్ అనే ముగ్గురు వ్యక్తులు ఢిల్లీలోని శివ మార్కెట్ కేంద్రంగా ఈ కాల్ సెంటర్లను నడిపిస్తున్నారని, ప్రస్తుతం వారు పరారీలో ఉన్నారని అధికారులు తెలిపారు. ఈ ముఠాకు సంబంధించి తెలంగాణ వ్యాప్తంగా మొత్తం 22 సైబర్ క్రైమ్ కేసులు నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ఆపరేషన్ సందర్భంగా 23 మొబైల్ ఫోన్లు, రెండు బ్యాంకు పాస్‌బుక్‌లను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన యువతుల వయసు 20 నుంచి 42 ఏళ్ల మధ్య ఉంది. పరారీలో ఉన్న ప్రధాన సూత్రధారుల కోసం గాలింపు ముమ్మరం చేశామని, మనీ ట్రయల్‌పై దృష్టి సారించి మోసం పూర్తి స్థాయిని అంచనా వేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## పన్నుల బిల్లుకు పార్లమెంట్ ఆమోదం.. యూపీఐ ఛార్జీలపై నిర్మలా సీతారామన్ కీలక ప్రకటన

- మొదటి పేజి తరువాయి

తెలిపిన సందర్భంగా ఆమె ఈ కీలక ప్రకటన చేశారు.

గత వారం లోక్‌సభ ఆమోదం పొందిన ఈ బిల్లును, సోమవారం రాజ్యసభ సైతం మూజువాణి ఓటు ద్వారా ఆమోదించింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్ చట్టంలోని సెక్షన్ 10ఏకు చేసిన సవరణ కేవలం వెసులుబాటు కల్పించే నిబంధన మాత్రమేనని వివరించారు. ఈ సవరణ ద్వారా యూపీఐ వినియోగదారులపై ఎటువంటి లావాదేవీ ఛార్జీలు లేదా పన్నులు విధించడం లేదని ఆమె సభకు విస్పష్టంగా తెలిపారు. మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధింపుపై వెలువడుతున్న ఊహాగానాలపై కూడా ఆమె స్పష్టతనిచ్చారు. పార్లమెంట్ ఆమోదం అనంతరం నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) స్టీరింగ్ కమిటీ దీనిపై తుది నిర్ణయం తీసుకుంటుందని, ప్రస్తుతం ఎటువంటి ఎండీఆర్ ఫ్రేమ్‌వర్క్‌ను ఖరారు చేయలేదని వెల్లడించారు. భవిష్యత్తులో ఒకవేళ ఎండీఆర్‌ను ప్రవేశపెట్టినా, అది కేవలం నిర్దిష్ట పరిమితికి మించిన అధిక విలువ గల వ్యాపార లావాదేవీలకు మాత్రమే వర్తిస్తుందని ఆర్థిక శాఖ గతంలోనే స్పష్టం చేసింది. పాలు, కూరగాయలు, కిరాణా వంటి 90 శాతానికి పైగా రోజువారీ కొనుగోళ్లు వ్యాపారులకు కూడా ఉచితంగానే అందుబాటులో ఉంటాయని అధికారులు వెల్లడించారు. 2016లో ప్రారంభమైన యూపీఐ, 2020 జనవరి నుంచి ఉచిత సేవలను అందిస్తూ ప్రపంచంలోనే అతిపెద్ద రియల్–టైమ్ చెల్లింపు వ్యవస్థగా అవతరించింది.

పెన్ పవర్
సెంట్రల్ ఆంధ్ర
ఏన్.టి.ఆర్ జిల్లా । కృష్ణా । గుంటూరు । పల్నాడు । బాపట్ల

# స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ ఎస్పి



**గుంటూరు, పెన్ పవర్,ఆగస్టు 10:** రాజధాని పెరేడ్ గ్రౌండ్స్ లో నిర్వహిస్తున్న స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ సోమవారం పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. 13వ తేదీన ఫుల్ డ్రెస్ రిహార్సల్స్ నిర్వహించుటకు సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రులు, న్యాయాధికారులు, అఖిల భారత సర్వీసుల అధికారులు తదితరులు వచ్చే మార్గాలను, వారికి కేటాయించే స్థలాలను పరిశీలించారు. వేల సంఖ్యలో సాధారణ ప్రజానీకం హాజరు అయ్యే అవకాశాలు ఉంటాయని, అందుకు తగిన విధంగా కూర్చునే ప్రదేశాలు, తాగు నీరు, మరుగుదొడ్లు వంటి సదుపాయాలు దృష్టిలో పెట్టుకోవాలని చెప్పారు. పార్కింగ్ ప్రదేశం, వాహనాల రద్దీ దృష్ట్యా ట్రాఫిక్ ప్లాన్ పక్కాగా ఉండాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ శాఖలు తమ ప్రగతిని ప్రదర్శించే శకటాలుహొతయారీ పూర్తి చేయాలని, 13వ తేదీన జరిగే తుది రిహార్సల్స్ లో పూర్తి స్థాయిలో ప్రదర్శన చూపాలని ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సూపరింటెండెంట్ వకుల్ జిందాల్, సి.ఆర్.డి.ఏ అదనపు కమిషనర్ లు ఏ.భార్గవ తేజ, కొల్లాబత్తుల కార్తీక్, గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కె.మయూర్ అశోక్, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాస రావు, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి.విజయ లక్ష్మి,హొజిల్లా పౌర సరఫరాల అధికారి పి.కోమలి పద్మహొతదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ జిల్లాలో ప్రత్యేక ఆధార్ సేవా శిబిరాలు : జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ



**విజయవాడ, పెన్ పవర్,ఆగస్టు 10 :** ప్రజలకు ఆధార్ సేవలను సులభంగా, వేగవంతంగా అందించేందుకు ఎన్టీఆర్ జిల్లాలో ప్రత్యేక ఆధార్ సేవా శిబిరాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ తెలిపారు. ఆగస్టు 11 నుంచి 14 వరకు, అలాగే ఆగస్టు 17 నుంచి 29 వరకు ఎంపిక చేసిన స్వర్ణ గ్రామాలు, స్వర్ణ వార్డు కార్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ఈ శిబిరాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. శిబిరాల్లో కొత్త ఆధార్ నమోదు, పేరు, చిరునామా, జనన తేదీ, మొబైల్ నంబర్, బయోమెట్రిక్ వివరాల నవీకరణ వంటి సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. 5 నుంచి 15 సంవత్సరాల వయస్సు పిల్లలకు తప్పనిసరి బయోమెట్రిక్ అప్డేట్ చేయించుకోవాలని సూచించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా సమీపంలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లోనే ఆధార్ సేవలు పొందేలా ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. ప్రజలు, విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ ప్రత్యేక శిబిరాలను సద్వినియోగం చేసుకుని ఆధార్ వివరాలను పరిశీలించుకుని అవసరమైన నవీకరణలు చేసుకోవాలని కలెక్టర్ కోరారు. శిబిరాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన మౌలిక సదుపాయాలు, సిబ్బంది సమన్వయం కల్పించాలని అధికారులను ఆదేశించారు.

# ఇంటింటా జాతీయ జెండా.. ప్రతి ఇంటా జాతీయ స్ఫూర్తి : జిల్లాకలెక్టర్ లక్ష్మీశ



**విజయవాడ, పెన్ పవర్,ఆగస్టు 10:** దేశ నిర్మాణంలో ప్రతి పౌరుడినీ భాగస్వామిగా చేయాలనే లక్ష్యంతో ఆగస్టు 10 నుంచి 15 వరకు పార్టనర్స్ ఇన్ నేషనల్ బిల్డింగ్ అనేనెను కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ తెలిపారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతదేశం లక్ష్య సాధనలో ప్రతి పౌరుడు తన వంతు పాత్ర పోషించాలని ఆయన పిలుపునిచ్చారు. "దేశం కోసం నేను.. నా వంతు కృషి చేస్తాను" అనే సంకల్పంతో ప్రతి ఒక్కరూ దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు. ప్రజలు, యువత, విద్యార్థులు, అధికారులు, క్రీడాకారులు, కళాకారులు, వివిధ రంగాల ప్రముఖులు దేశభక్తి, తమ భవిష్యత్ లక్ష్యాలు, దేశ నిర్మాణంలో తాము చేయాలనుకుంటున్న కృషిని తెలియజేస్తూ 30 సెకన్ల "అనే నేను" వీడియోలను రూపొందించి సోషల్ మీడియాలో పోస్టు చేయాలని సూచించారు. అలాగే ఆగస్టు 13 నుంచి 15 వరకు హర్ ఘర్ తిరంగా" కార్యక్రమాన్ని నిర్వహించి ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసేలా ప్రజలను భాగస్వాములను చేయాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలల్లోనూ "అనే నేను" కార్యక్రమాన్ని నిర్వహించి విద్యార్థులను చురుకుగా భాగస్వాములను చేయాలని సూచించారు. పంద్రాగస్టు వేడుకలను కేవలం ఉత్సవంగా కాకుండా దేశభక్తి, జాతీయ ఐక్యత, సామాజిక బాధ్యత, ప్రజా భాగస్వామ్యాన్ని పెంపొందించేలా నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేస్తూ, ప్రతి ఇంటా జాతీయ స్ఫూర్తిని నింపాలని జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు.

# పార్టనర్స్ ఇన్ నేషన్ బిల్డింగ్ కార్యక్రమం పెద్ద ఎత్తున చేపట్టాలి : జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ



**గుంటూరు, పెన్ పవర్,ఆగస్టు 10:** దేశ నిర్మాణంలో నేను (పార్టనర్స్ ఇన్ నేషన్ బిల్డింగ్) అనే కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టాలని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పార్టనర్స్ ఇన్ నేషన్ బిల్డింగ్ థీమ్ తో కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కోరారు. వివిధ అంశాలపై జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులు, మండల అధికారులతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని యాజమాన్య పాఠశాలలు, కళాశాలలోహొ ప్రతిజ్ఞ చేయాలని అన్నారు. పార్టనర్స్ ఇన్ నేషన్ బిల్డింగ్ పై ప్రతీ విద్యార్థికి అవగాహన కల్పించి బాధ్యత గలహొహొభావిభారత పౌరులుగా వారు స్వచ్ఛందంగా చేపట్టే కార్యక్రమాలపై వీడియోలు చేయాలని, తద్వారా వారిలో ఉత్సాహం స్ఫూర్తి కలుగుతుందన్నారు. విద్యా సంస్థలలో 15వ తేదీ వరకు నిర్వహించాలని అన్నారు. వీటిని యాష్ ట్యాగ్ లో – అనే నేను , పార్టనర్స్ ఇన్ నేషన్ బిల్డింగ్ , మై ఇండియా మై విషన్, ఇండిపెండెన్స్ డే 2026) కు ట్యాగ్ చేయాలని సూచించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, పరిశ్రమలు, పర్యాటక రంగం, క్రీడలు, ఎస్.జి.ఎస్.డబ్ల్యూ, స్వయం సహాయక సంఘాలు, విబి జి రామ్ జి తదితర విభాగాలలో ఉన్న అందరినీ భాగస్వామ్యం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని ఈ నెల 13వ తేదీ వరకు విస్తృతంగా చేపట్టాలని అన్నారు. 15 వరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమం హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ఈ నెల 13వ తేదీ నుండి 15వ తేదీ వరకు వాడ వాడలా నిర్వహించాలని సూచించారు. ప్రతి ఇంటిపైన త్రివర్ణ పతాకం ఎగరాలని అన్నారు. . ప్రతి ఇంటిపైన త్రివర్ణ పతాకం ఎగురవేసి సెల్ఫీలు తీసి పంపించవచ్చని చెప్పారు. 14వ తేదీన మొక్కలు నాటాలని చెప్పారు. 14, 15 తేదీల్లో అన్ని ప్రధాన భవనాలను త్రివర్ణ కాంతులతో అలంకరించాలని అన్నారు. ప్రధాన కూడళ్లను సైతం విద్యుత్ కాంతులతో అలంకరించి స్వాతంత్ర్య దినోత్సవ స్ఫూర్తి రగిలించాలని ఉద్బోధించారు. జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ మాట్లాడుతూ ఎస్.ఐ.ఆర్ పై విచారణ చేపట్టి ఓటరు నమోదు చేయాలని అన్నారు. ఇందుకు ముందుగా నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాస రావు, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి.జ్యోతి బసు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.శంకర్, ముఖ్య ప్రణాళిక అధికారి పి.శేష శ్రీ, జిల్లా పౌర సరఫరాల అధికారి పి.కోమలి పద్మ,హొమున్సిపల్ కమిషనర్ లు పాల్గొన్నారు.సోషల్ మీడియాలో పోస్టు చేయాలని సూచించారు. అలాగే ఆగస్టు 13 నుంచి 15 వరకు హర్ ఘర్ తిరంగా" కార్యక్రమాన్ని నిర్వహించి ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసేలా ప్రజలను భాగస్వాములను చేయాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలల్లోనూ "అనే నేను" కార్యక్రమాన్ని నిర్వహించి విద్యార్థులను చురుకుగా భాగస్వాములను చేయాలని సూచించారు. పంద్రాగస్టు వేడుకలను కేవలం ఉత్సవంగా కాకుండా దేశభక్తి, జాతీయ ఐక్యత, సామాజిక బాధ్యత, ప్రజా భాగస్వామ్యాన్ని పెంపొందించేలా నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేస్తూ, ప్రతి ఇంటా జాతీయ స్ఫూర్తిని నింపాలని జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు.

# డొంక రహదారుల ప్రతిపాదనలు శత శాతం రావాలి : జిల్లా కలెక్టర్ యం.సాయికాంత్ వర్మ



**గుంటూరు, పెన్ పవర్,ఆగస్టు 10:** డొంక రహదారుల ప్రతిపాదనలు శత శాతం రావాలని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ ఆదేశించారు. పంట పొలాలకు వెళ్ళుటకు డొంక రహదారులు ఉపయోగపడతాయని అన్నారు. వివిధ అంశాలపై జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులు, మండల అధికారులతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విబి జి రామ్ జి పనులలో వేతనదారులు ఎక్కువ సంఖ్యలో పాల్గొనాలన్నారు. పంట బీమా శత శాతం చేయాలని ఆదేశించారు. అన్నదాత సుఖీభవ కార్యక్రమానికి అర్హత సాధించుటకు రైతుల నమోదు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పబ్లిక్ పాజిటివ్ పర్సెప్షన్ (పి.పి.పి) లో ప్రజల సానుకూల స్పందన పెరగాలని, అందుకు తగిన విధంగా నాణ్యమైన సేవలు అందించాలని ఆదేశించారు. 11 నుండి ఆధార్ ప్రత్యేక శిబిరాలు జిల్లాలో ఆధార్ ప్రత్యేక శిబిరాలు ఈ నెల 11వ తేదీ నుంచి పాఠశాలలు, కళాశాలల్లో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చెప్పారు. 11 నుంచి 14వ తేదీ వరకు మరియు 17 నుండి 20వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. బయోమెట్రిక్ అప్డేషన్ పెండింగ్ ను ఇందులో ప్రధానంగా చేపట్టడం జరుగుతుందని అన్నారు. 64,067 కేసులు పెండింగ్ లో ఉన్నట్లు గణాంకాలు ఉన్నాయని తెలిపారు. ప్రధాన ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్ లు ఇందులో శ్రద్ధ వహించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాస రావు, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి.జ్యోతి బసు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.శంకర్, ముఖ్య ప్రణాళిక అధికారి పి.శేష శ్రీ, జిల్లా పౌర సరఫరాల అధికారి పి.కోమలి పద్మ,హొమున్సిపల్ కమిషనర్ లు పాల్గొన్నారు.

# రేపటి నుంచే నిర్ణయించిన ధరలకు కొనుగోళ్లు : మంత్రి అచ్చెన్నాయుడు






**గుంటూరు, పెన్ పవర్,ఆగస్టు 10 :** ఎఫ్‌సీవీ పొగాకు రైతులకు నష్టం రానివ్వబోమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. గుంటూరులోని పొగాకు బోర్డు కార్యాలయంలో రైతులు, పొగాకు బోర్డు అధికారులు, కొనుగోలు సంస్థల ప్రతినిధులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో రైతుల సమస్యలపై సుమారు రెండు గంటల పాటు చర్చించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే రేపటి నుంచి పొగాకు కొనుగోళ్లు జరగాలని మంత్రి ఆదేశించారు. బ్రైట్ గ్రేడ్‌కు కిలో రూ.230, మీడియం గ్రేడ్‌కు రూ.190, ఆఫ్‌స్టైల్‌కు రూ.130, లో గ్రేడ్‌కు రూ.110 కంటే తక్కువకు కొనుగోలు చేయరాదని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించే కంపెనీలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పొగాకు రైతులకు ప్రతి ఒక్కరికీ రూ.50 వేల చొప్పున రెండేళ్లపాటు వడ్డీలేని రుణం అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు. అనుమతితో సాగు చేసిన రైతులతో పాటు అనుమతి లేని సాగుదారులు, కౌలు రైతులు సహా అర్హులైన రైతులకు ఈ రుణ సదుపాయం కల్పిస్తామని చెప్పారు. అదేవిధంగా ఆఫ్‌స్టైల్, లో గ్రేడ్ పొగాకు రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఆర్థిక సాయం అందించనుంది. 94 మిలియన్ కేజీల పొగాకుకు క్వింటాల్‌కు రూ.1,000 చొప్పున, అంటే కిలోకు రూ.10 అదనపు సాయం అందిస్తామని మంత్రి వెల్లడించారు. ఈ మొత్తాన్ని పొగాకు విక్రయాల అనంతరం రైతుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వచ్చే సీజన్‌లో పొగాకు సాగును 80 మిలియన్ కేజీలకు మించకుండా కఠిన చర్యలు తీసుకుంటామని అచ్చెన్నాయుడు తెలిపారు. విత్తనాల సరఫరా దశ నుంచే నియంత్రణ చేపట్టి, మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా సాగును పరిమితం చేస్తామని చెప్పారు. పొగాకు రైతుల సమస్యల పరిష్కారంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టి సారించారని, ఇప్పటికే పలుమార్లు సమీక్షలు నిర్వహించి రైతులకు నష్టం రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారని మంత్రి తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, పొగాకు బోర్డు సమన్వయంతో రైతులను ప్రస్తుత సంక్షోభం నుంచి గట్టెక్కించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# పీజీఆర్ఎస్ ఫిర్యాదులపై నిర్లక్ష్యం చేస్తే చర్యలు : జిల్లా కలెక్టర్ లక్ష్మీశ





**విజయవాడ, పెన్ పవర్,ఆగస్టు 10 :** ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి, ప్రజలకు భరోసా కల్పించాలని జిల్లా కలెక్టర్ డా. లక్ష్మీశ ఆదేశించారు. ప్రతి అర్జీని సొంత సమస్యగా భావించి సత్వర, నాణ్యమైన పరిష్కారం అందించాలని సూచించారు. విజయవాడ కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియతో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో పెండింగ్ ఫిర్యాదులపై సమీక్ష నిర్వహించారు. గత వారం నుంచి పెండింగ్‌లో ఉన్న అర్జీలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఫిర్యాదులను కేవలం అధికారిక ప్రక్రియగా కాకుండా, సమస్యకు మూలకారణాన్ని గుర్తించి శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. అవసరమైన సందర్భాల్లో అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి పరిస్థితులను పరిశీలించి, ఫిర్యాదుదారులతో మాట్లాడాలని సూచించారు. ఒకసారి పరిష్కరించిన ఫిర్యాదు తిరిగి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రైతులకు ఎరువుల సరఫరా, పంటల మార్పిడి, ఇంటర్‌క్రాపింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పించాలని వ్యవసాయ, మండల స్థాయి అధికారులను ఆదేశించారు. ఎంపీడీవోలు, మండల వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతుల సమస్యలను తెలుసుకుని అవసరమైన సూచనలు అందించాలని తెలిపారు. పీజీఆర్ఎస్ ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం, అలసత్వం వహించే అధికారులపై కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. నామమాత్రపు పరిష్కారాలు చూపడం, సమస్య పూర్తిగా పరిష్కరించకుండానే అర్జీలను క్లోజ్ చేయడాన్ని ఉపేక్షించబోమన్నారు. ప్రజలకు సత్వర, నాణ్యమైన సేవలు అందించడం ప్రతి అధికారి బాధ్యత అని పేర్కొన్నారు. సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో మొత్తం 178 అర్జీలు స్వీకరించినట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం. లక్ష్మీనరసింహ, పీజీఆర్ఎస్ నోడల్ అధికారి జి. జ్యోతి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు

# మూడు విభాగాల్లో 27 ఉత్తమ ఛాయాచిత్రాల ఎంపిక చేసిన జ్యూరీ సభ్యులు జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ



**విజయవాడ: పెన్ పవర్,ఆగస్టు 10 :** ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఫొటోగ్రఫీ పోటీలకు ఫొటోగ్రాఫర్ల నుంచి విశేష స్పందన లభించిందని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. పోటీలకు మొత్తం 221 ఛాయాచిత్రాలు ఎంట్రీలలో పంపగా , వాటిలో మూడు కేటగిరీలకు సంబంధించిన 27 ఉత్తమ ఛాయాచిత్రాలను జ్యూరీ సభ్యులు ఎంపిక చేసినట్లు జిల్లా కలెక్టర్ వెల్లడించారు. విజయవాడ స్టేట్ గెస్ట్ హౌస్ కాంపౌండ్‌లోని జిల్లా సమాచార శాఖ కార్యాలయంలో సోమవారం ప్రదర్శించిన ఛాయాచిత్రాలను కేటగిరీల వారీగా పరిశీలించిన జ్యూరీ సభ్యులు ప్రతిభ, సృజనాత్మకత, అంశ ప్రాధాన్యత, ఛాయాచిత్ర నాణ్యత తదితర అంశాలను పరిగణనలోకి తీసుకొని 27 ఉత్తమ ఛాయాచిత్రాలను ఎంపిక చేశారని తెలిపారు . ఉత్తమ ఛాయాచిత్రాల ఎంపిక ప్రక్రియలో ఫొటోగ్రఫీ రంగానికి చెందిన అనుభవజ్ఞులు, అధికారులు జ్యూరీ సభ్యులైన ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా వ్యవస్థాపక చైర్మన్ టి.శ్రీనివాస రెడ్డి ,ఎఫ్ ఆర్ పి ఎస్ ది హిందూ రిటైర్డ్ ఫొటో జర్నలిస్ట్ సి.హెచ్.వి.ఎస్. విజయభాస్కర రావు, విజయవాడ స్టూడియో ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కె.రవికుమార్, సీనియర్ ఫొటోగ్రాఫర్ ఎస్.రామారావు (ఫ్లాష్ రామారావు), డీపీఆర్ఓ టి.నాగేశ్వరరావు, వీఎంసీ పీఆర్వో డాక్టర్ రజియా షబీనాలు కేటగిరీల వారీగా పరిశీలించి 27 ఉత్తమ ఫొటోలను ఎంపిక చేసినట్లు జిల్లాలో ఫొటోగ్రఫీ రంగంలో ప్రతిభ కనబరుస్తున్న వారికి తగిన ప్రోత్సాహం అందించాలనే ఉద్దేశంతో ఈ పోటీలను నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఎంపికైన ఉత్తమ ఛాయాచిత్రాలకు సంబంధించిన నగదు బహుమతులు, ప్రశంసా పత్రాలను ఆగస్టు 19న ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా అందజేయనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలోని ఫొటోగ్రాఫర్లను సన్మానించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఛాయాచిత్రాల ఎంపిక నిర్వహణ కార్యక్రమం లో డిఐపిఆర్ఓ కె.వి.రమణరావు, డివిజనల్ పిఆర్ఓ కె.రవి, రిటైర్డ్ ఏవి సూపర్వైజర్ వివి ప్రసాద్, ఏ.వి సూపర్వైజర్ బి.బాలాజీ, సిబ్బంది పాల్గొన్నారు.

# డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణకు వైసీపీ డిమాండ్

**మంత్రి లోకేష్ రాజీనామా చేయాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని చీరాలలో భారీ నిరసన**



**చీరాల, పెన్ పవర్, ఆగస్టు 10:** డీఎస్సీ నియామకాల్లో జరిగిన అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలని, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ చీరాలలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్ కాంగ్రెసు పార్టీ చీరాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీ గడియార స్తంభం వద్ద ఉన్న వైఎస్ రాజశేఖర్ రెడ్డి కాంస్య విగ్రహం నుంచి ప్రారంభమై రైల్వే స్టేషన్ సమీపంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సర్కిల్ వరకు సాగింది. కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, నిరుద్యోగ భృతి రూ.3,000 తక్షణమే అందించాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చీరాల నియోజకవర్గ పరిశీలకులు మోదుగుల బసవ పున్నారెడ్డి, వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు, నాయకులు, మహిళలు, కార్యకర్తలు, వార్డు, గ్రామ పార్టీ అధ్యక్షులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే మాలకొండయ్య పనితీరుపై సీఎం చంద్రబాబు ప్రశంసలు

**టాప్-10లోకి రావాలని సూచన.. చీరాల టీడీపీ శ్రేణుల్లో నూతనోత్సాహం**

**చీరాల, పెన్ పవర్, ఆగస్టు 10 :** చీరాల శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య పనితీరు, కష్టపడే తత్వాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రశంసించారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చీరాలలో నిర్వహించిన 'నేతన్నల సేవ'



కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడంపై సీఎం సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో చీరాల నియోజకవర్గం పనితీరును ముఖ్యమంత్రి ప్రత్యేకంగా ప్రస్తావించారు. చీరాలలో తెలుగుదేశం పార్టీ బలంగా ఉందని, భవిష్యత్‌లో ఎన్నికలు జరిగినా 2024 ఎన్నికల కంటే మెరుగైన మెజారిటీ సాధించే పరిస్థితి ఉందని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపాయి. చీరాల నియోజకవర్గంలో 32 ప్రభుత్వ సేవలు రాష్ట్ర సగటు కంటే మెరుగ్గా ఉండగా, మరో 19 సేవలు రాష్ట్ర స్థాయికి సమానంగా ఉన్నట్లు ప్రోగ్రెస్ రిపోర్టులో వెల్లడైనట్లు సీఎం తెలిపారు. 175 శాసనసభ నియోజకవర్గాల పనితీరు ర్యాంకుల్లో మాలకొండయ్య మొదటి సంవత్సరంలో 41వ స్థానంలో ఉండగా, ప్రస్తుత సంవత్సరంలో 30వ స్థానానికి చేరుకున్నారని చంద్రబాబు వివరించారు. పనితీరును మరింత మెరుగుపరుచుకుని టాప్-10లోకి బహిరంగ సభతో పాటు కార్యకర్తల సమావేశంలోనూ మాలకొండయ్య పనితీరును సీఎం ప్రశంసించడం చీరాల ఎమ్మెల్యేకు లభించిన గుర్తింపుగా టీడీపీ నాయకులు పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం, నియోజకవర్గ అభివృద్ధి, పార్టీ కార్యక్రమాల్లో చురుకైన పాత్రకు సీఎం ప్రశంసలు దక్కాయని వారు తెలిపారు.

# పీజీఆర్ఎస్‌లో అధికారులందరూ తప్పనిసరిగా పాల్గొనాలి : అదనపు కమిషనర్ ఐ.కిషోర్




**గుంటూరు, పెన్ పవర్, ఆగస్ట్, 10 :** సోమవారం నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ ఆదేశాల మేరకు జిఎంసి కౌన్సిల్ సమావేశ మందిరంలో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమంలో అదనపు కమిషనర్ ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ, పిజిఆర్ఎస్ కు అందే ఫిర్యాదుల్లో ఎక్కువగా పారిశుధ్యం, డ్రైనేజీ సమస్యలు, త్రాగునీటి సరఫరా మరియు వీధి దీపాల వంటి మౌలిక సదుపాయాలకు సంబంధించినవే వస్తున్నాయని, వాటిని వీలైనంత త్వరగా పరిష్కరించాలన్నారు. అర్జీల పరిష్కారంలో ఏదైనా ఇబ్బందులు ఎదురైతే, ఆ విషయాన్ని దరఖాస్తుదారునికి వివరించి, ఎండార్స్మెంట్ ఇవ్వాలన్నారు. నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపని అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పిజిఆర్ఎస్ ద్వారా 44 అర్జీలు అందాయని, వాటిలో పట్టణ ప్రణాళిక విభాగం 11, ఇంజినీరింగ్ విభాగం 13, రెవెన్యూ విభాగం 11, ప్రజారోగ్య విభాగం 7, ఎలక్షన్ సెల్ విభాగం 1, అకౌంట్స్ విభాగానికి సంబంధించి 1 ఫిర్యాదు అందాయన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ జి.సాంబశివరావు, సిఎంఓహెచ్ డాక్టర్ శాంతికళ, ఎంహెచ్ఓ డాక్టర్ సురేష్, ఎస్ఈ సుందరరామిరెడ్డి పాల్గొన్నారు.

# ఎం.ఎల్.ఎ క్వార్టర్స్ ను పరిశీలించనున్న ముఖ్యమంత్రి



**గుంటూరు, పెన్ పవర్,ఆగస్టు 10:** సీడ్ యాక్సెస్ రోడ్, స్టీల్ బ్రిడ్జిలను ఈ నెల 13వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ప్రారంభించనున్నారు. ఈ మేరకు సోమవారం పోలీస్ సూపరింటెండెంట్ వకుల్ జిందాల్, జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ లతో కలిసి అమరావతి అభివృద్ధి కార్పొరేషన్ చైర్ పర్సన్ లక్ష్మీ పార్థసారథి పరిశీలించారు. స్టీల్ బ్రిడ్జి, సీడ్ యాక్సెస్ రోడ్ ప్రారంభోత్సవ కార్యక్రమాలు అనంతరం అచ్చట ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి పాల్గొంటారు. అనంతరం శాసన సభ్యుల నివాస గృహ సముదాయాలను ముఖ్యమంత్రి పరిశీలిస్తారు. ఈ కార్యక్రమానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని చైర్ పర్సన్ లక్ష్మీ పార్థసారథి, జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ అధికారులకు సూచించారు. బందోబస్తు ఏర్పాట్లు, పార్కింగ్, కార్యక్రమానికి హాజరయ్యే ప్రజలు కూర్చునేందుకు ఏర్పాట్లు చేయాలని అన్నారు .ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, సి.ఆర్.డి.ఏ అదనపు కమిషనర్ కొల్లాబత్తుల కార్తీక్, తెనాలి రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీరమణి,హౌజిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి బి.వి.రంగా రావు, గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ కె.కళ్యాణ చక్రవర్తి, ఎం.టి.ఎం.సి కమిషనర్ అలీం భాషా, ఆర్ అండ్ బి పర్యవేక్షక ఇంజనీర్ ఆర్.శ్రీనివాస మూర్తి, జిల్లా పౌర సరఫరాల అధికారి పి.కోమలి పద్మ,హౌఅదనపు ఎస్పీ రవి కుమార్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె విజయ లక్ష్మి, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి.విజయ లక్ష్మి, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం లో వచ్చే అర్జీలకు నిర్దేశిత కాలపరిమితిలో పరిష్కారం చూపాలి జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ ఎస్ కె. ఖాజావలి



**గుంటూరు, పెన్ పవర్,ఆగస్ట్, 10:** సోమవారం జిల్లా కలెక్టరేట్లోని శంకరన్ హాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం (పి జి ఆర్ ఎస్) ను జిల్లా రెవెన్యూ అధికారి నిర్వహించారు. డి ఆర్ ఓ తో పాటు డిప్యూటీ కలెక్టర్లు గంగరాజు, డేవిడ్, జిల్లా విద్యాశాఖ అధికారి సలీం భాష అర్జీలు స్వీకరించి పరిష్కారానికి కృషి చేశారు.ఈ సందర్భంగా డి ఆర్ ఓ మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం పై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్న దృష్ట్యా, వివిధ శాఖల అధికారులు అర్జీలను ఎక్కువ కాలం పెండింగ్ లో ఉంచకుండా సరైన పరిష్కారం చూపాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం పై రాష్ట్ర ప్రభుత్వం ప్రజాభిప్రాయ సేకరణ జరుపుతున్న దృష్ట్యా, అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కారానికి కృషి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# హోమియో వైద్యశాలలో రోగుల పడిగాపులు!

**సిబ్బంది కొరతతో గంటల తరబడి నిరీక్షణ అదనపు సిబ్బందిని నియమించాలని డిమాండ్**



**పర్చూరు, పెన్ పవర్, ఆగస్టు 10:** ఉప్పుటూరు ప్రభుత్వ హోమియో వైద్యశాలలో సిబ్బంది కొరత, మౌలిక సదుపాయాల లేమితో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోజుకు 30 నుంచి 50 మంది వరకు రోగులు వస్తుండగా, డాక్టర్ ఒక్కరే వైద్య సేవలు అందించాల్సి రావడంతో గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోందని రోగులు ఆవేదన వ్యక్తం చేశారు. దూర ప్రాంతాలైన హైదరాబాద్, విజయవాడ, గుంటూరు, బెంగళూరు, ఒంగోలు, చీరాల, తెనాలి తదితర ప్రాంతాల నుంచి కూడా రోగులు వైద్యం కోసం వస్తున్నారని వైద్యుడు డాక్టర్ దాసరి చంద్రశేఖర్ తెలిపారు. చిన్న గదిలోనే గత ఏడాదిన్నరగా వైద్యశాల కొనసాగుతోందని, కనీస సదుపాయాలు, అదనపు సిబ్బంది లేకపోవడంతో రోగుల మధ్య అప్పుడప్పుడు వాగ్వాదాలు జరుగుతున్నాయని చెప్పారు. సమస్యను ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, డిప్యూటేషన్ ప్రాతిపదికన అదనపు సిబ్బందిని నియమించాలని కోరినట్లు తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వైద్యశాలకు అవసరమైన సిబ్బంది, మౌలిక సదుపాయాలు కల్పించాలని రోగులు కోరుతున్నారు.

# పర్చూరు టీడీపీ మండల అధ్యక్షుడిగా కొల్లా శ్రీనివాసరావు

**ప్రధాన కార్యదర్శిగా ఉప్పుటూరి నరేంద్ర నూతన కమిటీకి ఎమ్మెల్యే ఏలూరి శుభాకాంక్షలు**



**పర్చూరు, పెన్ పవర్, ఆగస్టు 10:** తెలుగుదేశం పార్టీ పర్చూరు మండల నూతన కమిటీని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రకటించారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు నాగులపాలెంకు చెందిన కొల్లా శ్రీనివాసరావును మండల అధ్యక్షుడిగా, పర్చూరుకు చెందిన ఉప్పుటూరి నరేంద్రను ప్రధాన కార్యదర్శిగా నియమించారు. మండల ఉపాధ్యక్షుడిగా చెరుకూరుకు చెందిన కొమ్మనబోయిన లక్ష్మణ్‌బాబు, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా కొల్లా శివరామ్ ప్రసాద్ (పర్చూరు), ద్రోణాదుల శ్రీరాములు (అన్నంబొట్లవారిపాలెం), జూపూడి మార్క్ (నూతలపాడు)లను ఎంపిక చేశారు. కార్యదర్శులుగా పొన్నలూరి వెంకటేశ్వర్లు (తన్నీరువారిపాలెం), నిడమానూరి ఖాజాబీ (తిమ్మరాజుపాలెం), దుడ్డు సల్మాన్ (బోడవాడ), కోశాధికారిగా పుల్లెల సుబ్బారావు (దేవరపల్లి) నియమితులయ్యారు. నూతన కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కమిటీ సభ్యులు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తూ ప్రజలకు మరింత చేరువ కావాలని, ప్రజలకు--ప్రభుత్వానికి వారధిగా నిలిచి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు.

# ఏలూరిని కలిసిన న్యాయవాది నాగ ప్రవీణ్

**హైకోర్టు స్టాండింగ్ కౌన్సిల్‌గా నియామకం అభినందించిన ఎమ్మెల్యే**



**కారంచేడు, పెన్ పవర్, ఆగస్టు 10 :** స్వర్ణ గ్రామానికి చెందిన హైకోర్టు న్యాయవాది వంకాయలపాటి నాగ ప్రవీణ్ గుంటూరు, ఒంగోలు, నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్లకు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు స్టాండింగ్ కౌన్సిల్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావును మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. నాగ ప్రవీణ్‌ను ఎమ్మెల్యే ఏలూరి అభినందించి, నూతన బాధ్యతల్లో విజయవంతంగా రాణించాలని ఆకాంక్షించారు.

# డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ జరపాలి: మాజీ మంత్రి విడదల రజిని




**చిలకలూరిపేట , పెన్ పవర్, ఆగస్టు 10 :** చిలకలూరిపేటలో వైఎస్సార్సీపీ ఆధ్వర్యంలో జరిగిన నిరసన ర్యాలీలో మాజీ మంత్రి విడదల రజిని పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో 'మెగా డీఎస్సీ' కాస్తా 'దగా డీఎస్సీ'గా మారిందని, దీని ముసుగులో ఉద్యోగాలు అమ్ముకున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ వ్యవహారంపై తక్షణమే సీబీఐ విచారణ జరిపించాలని, నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అలాగే, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగులకు నెలకు రూ.3,000 భృతిని తక్షణమే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని ఆమె స్పష్టం చేశారు.

# బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహణ



**విజయవాడ, గుణదల మండలం, మొగలరాజపురం, ఆగస్టు 10 :** విజయవాడ తూర్పు నియోజకవర్గ బీజేపీ నాయకులు, న్యాయవాది డాక్టర్ తరుణ్ కాకాని ఆధ్వర్యంలో బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్ జన్మదిన వేడుకలను గుణదలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేశ్ నాయుడు మాట్లాడుతూ, కేంద్రం మరియు రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వాల సహకారంతో అభివృద్ధి శరవేగంగా కొనసాగుతోందని అన్నారు. రాష్ట్రంలో పార్టీ మరింత బలోపేతం కావడానికి పి.వి.ఎన్. మాధవ్ నాయకత్వంలో ప్రతి కార్యకర్త సమిష్టిగా పనిచేస్తున్నారని తెలిపారు. కార్యక్రమ నిర్వాహకుడు డాక్టర్ తరుణ్ కాకాని మాట్లాడుతూ, అంత్యోదయ స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు సమాజంలోని చివరి వ్యక్తికి చేరేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా కార్యదర్శి శ్రీమతి మాధవి కంభంపాటి, అధికార ప్రతినిధి జగర్లమూడి గాయత్రి, సీనియర్ నాయకులు దాసరి రవికుమార్, గోగినేని రాజేంద్ర ప్రసాద్, ఎన్. పవన్ కుమార్, లావణ్య, తులసి, పసుమర్తి రాజేష్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయవాడ తూర్పు నియోజకవర్గానికి చెందిన వందలాది మంది బీఎంఎస్ ఆటో స్టాండ్ కార్మికులు, స్థానిక రోజువారీ కూలీలు, నిరుపేదలకు బట్టలు మరియు పండ్లు పంపిణీ చేసి సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

# ఎస్సీ కార్పొరేషన్ నిధులు వెంటనే విడుదల చేయాలి : కోట సుబ్బు మాదిగ



**చిలకలూరిపేట , పెన్ పవర్, ఆగస్టు 10 :** రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ పెండింగ్ నిధులను వెంటనే విడుదల చేసి, అర్హులైన ఎస్సీ లబ్ధిదారులకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి కోట సుబ్బు మాదిగ డిమాండ్ చేశారు. నిధుల విడుదలలో జాప్యం వల్ల ఎస్సీ యువత, పేద కుటుంబాలు బ్యాంకు రుణాలు పొందలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేషన్‌కు తగిన బడ్జెట్ కేటాయించి, పెండింగ్ సబ్సిడీలను వెంటనే మంజూరు చేయాలని ఆయన కోరారు. నియోజకవర్గాల వారీగా దరఖాస్తులు స్వీకరించి, కొత్త స్వయం ఉపాధి పథకాలను పారదర్శకంగా అమలు చేయాలన్నారు. నిధుల విడుదలలో ప్రభుత్వం ఇకనైనా స్పందించకపోతే పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా సీనియర్ నాయకులు జమ్మలమూడి విజయ మాదిగ, యువసేన నాయకులు పాలెపోగు వరుణ్, మండల అధ్యక్షులు తిమోతి, గ్రామ నాయకులు లాజర్, పచ్చిగోళ్ళ సుధాకర్, మన్నవ సురేష్, దావల చంటి తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే ఆనందబాబును కలసిన పెరవలి మత్స్యకార సంఘం నూతన కార్యవర్గం



**వేమూరు( భట్టిప్రోలు) పెన్ పవర్ 10:** నూతనంగా ఎన్నిక కాబడిన పెరవలి ఫిషర్ మాన్ కో-ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ బొమ్మిడి అంకమ్మరావు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు, సంఘ పెద్దలు వేమూరు శాసనసభ్యులు, మాజీ మంత్రి నక్కా ఆనందబాబును సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గం ఎమ్మెల్యే ఆనందబాబును పుష్పగుచ్ఛం, శాలువాతో సత్కరించారు. నూతన కార్యవర్గ సభ్యుల వివరాలను బొమ్మిడి అంకమ్మరావు ఆనందబాబుకు తెలియజేశారు. వీరందరికీ శాసనసభ్యులు ఆనందబాబు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ నూతన కార్యవర్గం మత్స్యకారుల సంక్షేమం, అభివృద్ధి కోసం కృషి చేయడంతో పాటు, సహకార సంఘాన్ని మరింత బలోపేతం చేసి సభ్యులందరికీ మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. వీరితోపాటు పార్టీ నాయకులు దాది లక్ష్మణరావు, ప్రసాదం రామయ్య, తదితరులు ఉన్నారు.

# తూర్పులో అభివృద్ధి వేగవంతం ఎమ్మెల్యే నసీర్

**గుంటూరు, పెన్ పవర్, ఆగస్ట్, 10 :** అభివృద్ధికి నూతన అధ్యాయం లిఖిస్తున్నామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. సోమవారం స్థానిక జామియా నగర్, అరుంధతి నగర్ ప్రాంతాల్లో అవుట్ ఫాల్ డ్రెయిన్, మంచినీటి పైపు లైన్ల నిర్మాణానికి రూ.2 లక్షలతో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో డ్రెయిన్లు, రోడ్లు, మంచినీటి పైపు లైన్ల నిర్మాణం వేగవంతంగా చేపడుతున్నామని తెలిపారు. అందులో భాగంగా



జామియా నగర్ లో రూ.1.50 లక్షలతో అవుట్ ఫాల్ డ్రెయిన్ నిర్మించబోతున్నామని చెప్పారు. అరుంధతి నగర్, మంగళదాస్ నగర్, అంబేద్కర్ నగర్, రాజగోపాల్ నగర్ ప్రాంతాలను కలుపుతూ రూ.50 లక్షలతో మంచి నీటి పైపు లైను ఏర్పాటు చేస్తామన్నారు. గత వైసీపీ ఐదేళ్ల పాలనలో గుంటూరు తూర్పు నియోజకవర్గంలో అభివృద్ధి పదేళ్లు వెనక్కి వెళ్లిందని విమర్శించారు. ప్రధాన ప్రాంతాల్లో సైతం రోడ్లు నిర్మాణం చేపట్టిన పరిస్థితి ఏర్పడిందన్నారు. మారుమూల కాలనీలకు మంచినీళ్లు కూడా అందించలేదని మండిపడ్డారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నియోజకవర్గంలో అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో రూ.350 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. వంద కోట్ల రూపాయలతో రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం పూర్తి చేశామని తెలిపారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా అందుబాటులో ఉంటున్నామని, నియోజకవర్గాన్ని అభివృద్ధిలో రోల్ మోడల్ గా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చామని, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేశామని తెలిపారు. తల్లికి వందనం అమలుతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ఇంటికో పారిశ్రామికవేత్తను తయారు చేసేందుకు రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతికి బాటలు వేశారన్నారు. ఇప్పటికే గూగుల్ వంటి పెద్ద సంస్థలు రాష్ట్రానికి తరలివచ్చాయని, 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పని చేస్తున్నామని చెప్పారు.

## అక్రమాలకు పాల్పడుతున్న కూటమి ప్రభుత్వం : వరికూటి అశోక్ బాబు.



**భట్టిప్రోలు పెన్ పవర్ ఆగస్టు, 10 :** మండల కేంద్రమైన భట్టిప్రోలు లో మెగా డీఎస్సీ అక్రమాల పై నిరసన కార్యక్రమం మండల పార్టీ ఆధ్వర్యంలో అద్దేపల్లి-భట్టిప్రోలు గ్రామాలలో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్ బాబు పాల్గొని రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడుతూ డీఎస్సీ లో అక్రమాలకు పాల్పడిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలన్నారు. నిరుద్యోగుల కు రూ 3వేలు వెంటనే ఇవ్వాలన్నారు. ఇంకా అనేకమందికి తల్లికి వందనం పైకం జమ కాలేదన్నారు. విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ కూడా ఇవ్వటం లేదన్నారు. మహిళలకు ఇవ్వవలసిన రూ.18వేల గురించి కూటమి ప్రభుత్వం నోరు మెదపడం లేదన్నారు.రైతు భరోసా కౌలు రైతులకు ఇంతవరకు ఎటువంటి న్యాయం చేయలేదని అన్నారు. విద్యారంగాన్ని పేకాటరంగంగా మార్చిన ఘనత కూటమి ప్రభుత్వం దేనని అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్నటువంటి అక్రమాల మీద, బడుగు బలహీన వర్గాల నిర్లక్ష్యంగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. నిరుద్యోగులకు 20 లక్షల ఉద్యోగాలు ఇస్తారని చెప్పి మభ్యపెట్టారన్నారు. .ఈ విధంగా కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను మోసపు హామీలు ఇచ్చి మోసం చేసిందన్నారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి,వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ర్యాలీలో 5 మండలాల కన్వీనర్లు నాయకులు కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

## జగన్ హయాంలో ఆడబిడ్డలపై పూటకో అఘాయిత్యం.. రోజుకో నేరం : ప్రత్తిపాటి

### గంజాయి, కల్తీ మద్యం, మాదక ద్రవ్యాల విక్రయాలు ప్రోత్సహించడం ద్వారా.. ఆడబిడ్డలపై నేరాలకు జగనే పరోక్షంగా సహకరించాడు : ప్రత్తిపాటి

### ఐదేళ్లు ఆడబిడ్డల రక్షణని విస్మరించిన జగన్, నేడు మొసలి కన్నీరు కారుస్తున్నాడు : ప్రత్తిపాటి

**చిలకలూరిపేట , పెన్ పవర్, ఆగస్టు 10 :** వైద్య విద్యార్థిని ప్రియాంక మరణం తీవ్ర విచారకరం. వైద్యురాలిగా ప్రజలకు సేవలందించాల్సిన యువతి, మద్యం మత్తులో ఉన్న ఇద్దరు యువకుల దుశ్చర్యతో ప్రాణాలు పోగొట్టుకోవడం అత్యంత బాధాకరం. ప్రియాంక ప్రమాద ఘటనపై ప్రభుత్వం, ముఖ్యమంత్రి వెంటనే స్పందించి బాధితురాలికి మెరుగైన వైద్యసేవలు అందేలా చూశారు. ప్రియాంకను కారుతో ఢీకొన్న నిందితులకు చట్ట ప్రకారం కఠిన శిక్షలు పడేలా చూడాలని సీఎం స్థానిక జిల్లా ఎస్పీని ఆదేశించారు. యువతి మరణానంతరం కుటుంబానికి ఆర్థిక సాయం ప్రకటించి, ప్రభుత్వపరంగా అండగా ఉంటామని, నిందితుల్ని కఠినంగా శిక్షిస్తామని భరోసా ఇచ్చారు. తన కుమార్తె ప్రమాద ఘటనపై ఏపీ పోలీసుల దర్యాప్తు తీరుపై తనకు నమ్మకముందని స్వయంగా మృతురాలి తండ్రే స్పష్టం చేశారు.



**ప్రియాంక ఘటనలో నేరస్తుల్ని సమర్థించాల్సిన జగన్.... మృతురాలి తరుపున మాట్లాడటం విచిత్రంగా ఉంది.**

ప్రియాంక ప్రమాదానికి గురైనప్పుడు, ఆమె ఆసుపత్రిలో చావుబతుకుల మధ్య కొట్టుమిట్లాడుతున్నప్పుడు జగన్ కు ఆమె వేదన.. కుటుంబసభ్యుల రోదన గుర్తురాలేదు. పొరుగు రాష్ట్రంలో ఉండే ప్రియాంక తల్లిదండ్రులు ఏపీ పోలీసుల పనితీరుపై తమకు నమ్మకముందని చెబుతుంటే.. జగన్ మాత్రం పనిగట్టుకొని పోలీస్ వ్యవస్థపై విమర్శలు చేస్తున్నాడు. యువతి మరణించిన వెంటనే కనీస మానవత్వం లేకుండా, జగన్ ప్రభుత్వంపై, పోలీసులపై దుష్ప్రచారానికి తెరలేపాడు. వైద్య విద్యార్థిని మరణాన్ని రాజకీయ అంశంగా మలిచే ప్రయత్నం చేస్తున్న జగన్ వైఖరిని ప్రజలు ఆమోదించరు. 'ప్రియాంక ప్రమాద ఘటనలో ప్రభుత్వం సకాలంలో స్పందించలేదు.. పోలీసులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారు' అన్న జగన్ వ్యాఖ్యలు పచ్చి బూటకమనే చెప్పాలి. రాష్ట్రంలో ఎప్పుడు ఏ ఘటన జరుగుతుందా.. దాన్ని ప్రభుత్వంపై, ముఖ్యమంత్రిపై నెట్టేసి ఎలా బురద జల్లుదామా, వ్యవస్థలపై ఏ విధంగా దుమ్మెత్తిపోదామా అన్న ఆలోచనల్లోనే జగన్ బతుకుతున్నాడు. ఎప్పుడూ నేరస్తుల్ని పరామర్శిస్తూ, వారికి అండగా నిలిచే జగన్.. ప్రియాంక విషయంలో ఆమె మరణానికి కారకులైన యువకుల్ని సమర్థించకుండా, యువతి తరుపున మాట్లాడటం చాలా విచిత్రంగా ఉంది.

**జగన్ హయాంలో ఆడబిడ్డలపై పూటకో అఘాయిత్యం..రోజుకో నేరం.**

జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఏనాడూ ఆడబిడ్డల రక్షణ గురించి ఆలోచించలేదు. వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో నేరాలు, ఘోరాలు విచ్చలవిడిగా పెరిగాయని, ముఖ్యంగా మహిళలపై అత్యాచారాలు, గృహహింస, వేధింపుల వంటి ఘటనలు ఏటేటా పెరిగాయని స్వయంగా కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎన్.సీ.ఆర్.బీ నివేదికే చెప్పింది. 2019-23 మధ్య మహిళలపై పూటకో అఘాయిత్యం, రోజుకో నేరానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా కారకుడైన జగన్.. నేడు ఆడబిడ్డల రక్షణపై మొసలికన్నీరు కారుస్తున్నాడు. ఐదేళ్లు రాష్ట్రంలో గంజాయి, కల్తీ మద్యం, మాదకద్రవ్యాల్ని విక్రయాన్ని ప్రోత్సహించడం ద్వారా, మహిళలపై నేరాలకు పరోక్షంగా జగనే అండగా నిలవడం వాస్తవం కాదా? పసలేని దిశ చట్టంతో మూడువారాల్లో నిందితుల్ని ఉరికంబం ఎక్కిస్తామని ప్రగల్భాలు పలికిన జగన్, ఒక్క నేరస్తుడిని కఠినంగా శిక్షించింది లేదు. కేంద్ర ఆమోదం లేని ఉత్తుత్తి చట్టంతో.. జగన్ ఆడబిడ్డల్ని మోసగించి, తన రాజకీయ ప్రయోజనాలు నెరవేర్చుకున్నాడు. రాష్ట్రంలో జరిగే ప్రతి ఘటనను ప్రభుత్వ వైఫల్యంగా చిత్రీకరిస్తూ, ప్రజల్లో అసంతృప్తి పెంచి, రాష్ట్ర పెట్టుబడుల్ని అడ్డుకోవాలన్నదే జగన్ కుయుక్తి." అని రాజమహేంద్రవరం పార్లమెంట్ టీడీపీ కో ఆర్డినేటర్ , శాసనసభ్యులు ప్రత్తిపాటి సోమవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు.

## దళితుల సమస్యలపై 24న కలెక్టరేట్ వద్ద ధర్నా



**గుంటూరు, పెన్ పవర్,ఆగస్టు 10 :** దళితులపై దాడులు, వివక్షను అరికట్టి సామాజిక సమానత్వం కల్పించాలని, జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించి దళితవాడల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీహెచ్. బాబూరావు డిమాండ్ చేశారు. ఈ నెల 24న గుంటూరు కలెక్టరేట్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'సామాజిక శంఖారావం' ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. బ్రాడీపేటలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో ఈమని అప్పారావు అధ్యక్షతన జరిగిన జిల్లా విస్తృత సమావేశంలో బాబూరావు మాట్లాడారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికుల వేతనాలు పెంచకుండా ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని విమర్శించారు. కార్మికుల వేతనాలను తక్షణమే పెంచాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 15న జాతీయ సమైక్యత దినం సందర్భంగా ప్రతి ప్రాంతంలో జాతీయ జెండాలు ఎగురవేయాలని పిలుపునిచ్చారు. మంగళగిరి నియోజకవర్గంలో ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు, పట్టాలు ఇవ్వాలని, రాజధాని ప్రాంతంలోని ఆర్-5 జోన్‌లో ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వై. నేతాజీ మాట్లాడుతూ చెరువు, రైల్వే, అటవీ భూముల్లో ఏళ్లుగా నివసిస్తున్న పేదలకు పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాశం రామారావు, కె. నళినీకాంత్, ఎం. రవి, బి. వెంకటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు యు. దుర్గారావు, ఎల్. అరుణ, డి. లక్ష్మీనారాయణ, కె. అజయ్ కుమార్, బి. ముత్యాలరావు, బి. లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి : జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ



**విజయవాడ: పెన్ పవర్,ఆగస్టు 10 :** స్వాతంత్ర్య స్ఫూర్తి ఉట్టిపడేలా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించేందుకు మాకినేని బసవ పున్నయ్య స్టేడియంలో అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో వేడుకల ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, వివిధ శాఖలు తమకు అప్పగించిన బాధ్యతలను సమన్వయంతో, ఎలాంటి లోపాలకు తావులేకుండా పూర్తి చేయాలని సూచించారు. రాష్ట్ర ఐటి, విద్యా శాఖల మంత్రి నారా లోకేష్ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. వేడుకల ప్రాంగణంలో వేదిక, బారికేడింగ్, పార్కింగ్, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, భద్రత తదితర ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించేలా ఆకర్షణీయమైన శకటాలు, స్టాళ్లు ఏర్పాటు చేయాలని, శకటాలకు సంబంధించిన డిజిటల్ నోట్స్‌ను సీపీఓకు వెంటనే పంపాలని సూచించారు. దేశభక్తి, జాతీయ సమైక్యత, దేశ నిర్మాణ స్ఫూర్తిని ప్రతిబింబించేలా సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించాలని తెలిపారు. వివిధ శాఖల్లో ఉత్తమ సేవలు అందించిన అధికారులు, సిబ్బందిని గుర్తించి ప్రశంసా పత్రాలు అందజేయాలని ఆదేశించారు. రాబోయే 21 ఏళ్లలో తలసరి ఆదాయం పెంపు, పారిశ్రామిక అభివృద్ధి, వ్యవస్థాపకత, ఉపాధి అవకాశాల విస్తరణ, యువత నైపుణ్యాభివృద్ధి వంటి అంశాలపై దృష్టి సారించాలని తెలిపారు. ఆగస్టు 14, 15 తేదీల్లో అన్ని ప్రభుత్వ భవనాలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో త్రివర్ణ దీపాలంకరణ చేపట్టాలని ఆదేశించారు. ఆగస్టు 14న ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ప్రభుత్వ కార్యాలయాలు, ఇళ్ల ప్రాంగణాల్లో పెద్దఎత్తున మొక్కలు నాటాలని సూచించారు. ఆగస్టు 13 నుంచి 15 వరకు ప్రతి ఇల్లు, వ్యాపార సముదాయం, ప్రభుత్వ కార్యాలయాలపై జాతీయ జెండాను ఎగురవేసేలా ప్రజలను ప్రోత్సహించాలని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించి విద్యార్థులు తాము భవిష్యత్తులో ఏం కావాలనుకుంటున్నారు, రాష్ట్ర అభివృద్ధికి ఎలా తోడ్పడాలనుకుంటున్నారు అనే అంశాలపై తమ సొంత స్వయం ప్రతిజ్ఞ రూపొందించుకునేలా ప్రోత్సహించాలని ఆదేశించారు. ప్రతిజ్ఞ అందరికీ ఒకే విధంగా కాకుండా విద్యార్థుల సొంత ఆలోచనలు, వ్యక్తిగత లక్ష్యాలకు ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి, నిర్దేశించిన గడువులోగా ఏర్పాట్లను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## సదరం సహాయక కేంద్రంలోదివ్యాంగులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

### నవ్యాంధ్ర వికలాంగుల అధ్యక్షులు షేక్ కాలేషా



**గుంటూరు: పెన్ పవర్, ఆగస్ట్, 10 :** గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జీజీహెచ్)లోని సదరం సహాయక కేంద్రంలో దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు షేక్ కాలేషా కోరారు. ఈ మేరకు సోమవారం జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ గోరిజవోలు దుర్గాప్రసాద్‌ను కలిసి సమస్యలను వివరించి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దూర ప్రాంతాల నుంచి సదరం సర్టిఫికెట్ల కోసం వచ్చే నడవలేని, మాట్లాడలేని, వినికిడి లోపం ఉన్న దివ్యాంగులు, వారి సహాయకులు సరైన సమాచారం కోసం సదరం సహాయక కేంద్రాన్ని ఆశ్రయిస్తున్నారని తెలిపారు. అయితే కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న కొంతమంది ఔట్సోర్సింగ్ సిబ్బంది సరైన సమాచారం ఇవ్వకపోవడంతో దివ్యాంగులు పలుమార్లు ఆసుపత్రికి రావాల్సి వస్తోందని పేర్కొన్నారు. అంతేకాకుండా దివ్యాంగులు, వారి సహాయకులతో కొందరు సిబ్బంది విసుక్కోవడం, కసురుకోవడం, సూటిపోటి మాటలతో మాట్లాడటం వల్ల వారి ఆత్మగౌరవం దెబ్బతింటోందని కాలేషా ఆరోపించారు. సదరం సర్టిఫికెట్లకు సంబంధించిన సమాచారం అత్యంత గోప్యత, భద్రతతో కూడుకున్నదని, విధులు నిర్వహించే సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. దివ్యాంగుల హక్కుల చట్టం--2016 నిబంధనల ప్రకారం దివ్యాంగుల ఆత్మగౌరవాన్ని కాపాడేలా చర్యలు తీసుకోవాలని, సదరం సహాయక కేంద్రంలో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ సిబ్బందిపై విచారణ జరిపి అవసరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ధూపాటి రమణయ్య, మానేపల్లి రవితేజ, బత్తుల సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టరేట్ పి జి ఆర్ ఎస్ కు 108 సమస్యల అర్జీలు

### అర్జీలు మళ్ళీ రాకుండా పరిష్కరం చేయాలి : జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్,వి.



**బాపట్ల,( పెన్ పవర్ )ఆగస్టు 10 :** బాపట్ల పి ఆర్ ఎస్ లో ప్రజల అందజేసే సమస్యల కు సంబంధించి మళ్ళీ అర్జీలు రాకుండా అర్జీదారుల తో మాట్లాడి సమస్యలు పరిష్కరం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్,వి. పేర్కొన్నారు. కలెక్టరేట్ లోని పి జి ఆర్ ఎస్ హాల్ నందు నిర్వహించిన ప్రజా సమస్యల పరిస్కార వేదిక(పి.జి.ఆర్.ఎస్) కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ మండలాల నుంచి వివిధ రకాల సమస్యలతో వచ్చిన అర్జీదారులు చెప్పే సమస్యలను వింటూ వారి నుంచి ఇంచార్జి డి ఆర్ ఓ మరియు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లవన్న,జాయింట్ కలెక్టర్ భావన వశిష్ట లతో కలసి అర్జీల ను జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పి ఆర్ ఎస్ లో ప్రజల అందజేసే సమస్యల కు సంబంధించి అర్జీదారులు మళ్ళీ పి జి ఆర్ ఎస్ కు రాకుండా అర్జీదారుల తో మాట్లాడి సమస్యలు పరిష్కరం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈరోజు నిర్వహించిన పి జి ఆర్ ఎస్ కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 108 మంది అర్జీదారు సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకు రావడం జరిగిందని తెలిపారు. దివ్యాంగులు, వృద్ధుల వద్దకు కలెక్టర్ స్వయంగా వెళ్లి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తక్షణమే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అర్జీలు పునరావృతం గాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అర్జీదారులు సంతృప్తి చెందేలా వారికి పరిష్కారం చూపాలన్నారు. నాణ్యత ప్రమాణాలు పాటించాలని కలెక్టర్ అధికారులకు పలు సూచనలు చేశారు. పి జి ఆర్ ఎస్ అర్జీల పరిష్కారంలో ప్రజలకు అత్యుత్తమ సేవలు అందించిన కొల్లూరు తహాశీల్దార్ ను ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఘనంగా సత్కరించారు. శాలువల కప్పి, జ్ఞాపికను అందజేశారు. వచ్చిన ప్రతి అర్జీని నిశితంగా పరిశీలించిన తదుపరి నాణ్యతతో పరిష్కరిస్తున్నామని తహాశీల్దార్ కలెక్టర్ కు తెలిపారు. పరిష్కార మార్గంలో నాణ్యత ప్రమాణాలు పాటించడం ద్వారా అవార్డు దక్కిందన్నారు. అధికారులు, సిబ్బంది సహకారంతోనే ఇది సాధ్యమైందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డి యం ఒ హెచ్ ఓ.డాక్టర్ ఎస్.విజయమ్మ, డి పి ఓ.యల్.ప్రభాకర్ రావు, సి పి ఓ.ఏ.ఎస్.రాజు, పి డి లు, డిఆర్డీఏ, డ్వామా, మెప్మా, గృహ నిర్మాణ సంస్థ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ,బి.సింగయ్య, విజయలక్ష్మి, ఆనంద్ సత్య పాల్, వెంకటేశ్వర రావు,రాధమాదవి,డి ఈ ఓ.శ్రీనివాస్, మార్క్ పేడ్ డి యం.కరుణశ్రీ, డి సి హెచ్ ఎస్.పద్మావతి, డి టి సి. పరందామ రెడ్డి, ఆర్ టి సి ఆర్ యం.విమల, జి యం.డి ఐ సి.రామకృష్ణ, జిల్లా ఖజానా అధికారిణి పద్మావతి,జిల్లా పౌర సరఫరాల శాఖ డి ఎస్ ఓ.జగన్మోహన్, గ్రామ వార్డు సచివాలయాల జిల్లా కోఆర్డినేటర్ యశ్వంత్ ,బి.సి. శాఖల అధికారులు శివలీల,జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ అధికారిణి మాధవి, మత్స్య శాఖ ఏ డి గాలిదేవుడు,ఏ పి ఎస్ పి డి సి యల్,ఆంజనేయులు, భూ రికార్డ్స్ ఏ డి,సాంబశివరావు, జిల్లా ట్రెజరీ అధికారిణి పద్మావతి,సర్వ శిక్ష అభియాన్ పి ఓ.శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలి





### ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలి

### నిరుద్యోగులకు రూ.3 వేల భృతి అమలు చేయాలి

### బాపట్లలో భారీ నిరసన ర్యాలీ

**బాపట్ల:(పెన్ పవర్) ఆగస్టు 10** బాపట్ల డీఎస్సీ నియామకాల్లో చోటుచేసుకున్న అక్రమాలపై సీబీఐతో సమగ్ర విచారణ జరిపించాలని, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ బాపట్ల నియోజకవర్గ స్థాయిలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. బాపట్ల నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీ కలెక్టర్ కార్యాలయం మార్గంలోని ఫ్లైఓవర్ కింద నుంచి పటేల్ నగర్ వరకు కొనసాగింది. పార్టీ పరిశీలకులు సురేంద్ర ఈ కార్యక్రమంలో ప్రత్యేకంగా పాల్గొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, నిరుద్యోగులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ డీఎస్సీ వ్యవహారంపై అనేక అనుమానాలు, ఆరోపణలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో నిజానిజాలను వెలికితీసేందుకు సీబీఐతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అలాగే విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను తక్షణమే విడుదల చేయాలని కోరారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీ మేరకు నెలకు రూ.3,000 నిరుద్యోగ భృతిని వెంటనే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. నిరుద్యోగ సమస్యను పరిష్కరించేందుకు ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయడంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ప్రభుత్వం తమ డిమాండ్లపై తక్షణమే స్పందించి సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. బాపట్ల నియోజకవర్గ స్థాయిలో మహిళలు ముఖ్యంగా ఈ నిరసన ప్రదర్శనకు కథను తొక్కారు కలెక్టరేట్ వరకు భారీగా మహిళలు వైసిపి నాయకులు పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో పట్టణ మండల అధ్యక్షులు కాగిత సుధీర్ బాబు ఏడుకొండల రెడ్డి ఎల్లావుల ఏడుకొండలు లీల శ్రీనివాస్ రెడ్డి కర్లపాలెం ఎంపీపీ వనజ ఎంపీటీసీలు మాజీ సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు

# మిరప నారులో నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

### షేడ్‌నెట్, బహిరంగ నారుమడులను పరిశీలించిన ప్రిన్సిపల్ సైంటిస్ట్ డా. వెంకట రమణ

**బాపట్ల:( పెన్ పవర్ ), ఆగస్ట్ 10** బాపట్ల జిల్లా కర్లపాలెం మండలం లో కర్లపాలెంమిరప సాగులో అధిక దిగుబడి, నాణ్యమైన పంట సాధించాలంటే నారు దశ నుంచే శాస్త్రీయ యాజమాన్య పద్ధతులను పాటించాలని రీజినల్ హార్టికల్చర్ రీసెర్చ్ స్టేషన్, గుంటూరు ప్రిన్సిపల్ సైంటిస్ట్ డా. శ్రీ వెంకట రమణ సూచించారు. కర్లపాలెం మండలంలోని నల్లమోతువారిపాలెం, కొత్త నందాయపాలెం గ్రామాల్లో మిరప షేడ్‌నెట్ నర్సరీలు, బహిరంగ మిరప నారుమడులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మిరప నర్సరీల్లో నారు మొక్కల పెరుగుదల, మొక్కల ఆరోగ్య పరిస్థితి, నారు నాణ్యత, నీటి యాజమాన్యం, పోషకాల వినియోగం, తెగుళ్ల మరియు పురుగుల ఉధృతి తదితర అంశాలను పరిశీలించారు. షేడ్‌నెట్‌లో పెంచుతున్న మిరప నారుతో పాటు బహిరంగ ప్రదేశాల్లో పెంచుతున్న నారును పరిశీలించి, రైతులు పాటిస్తున్న పద్ధతులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. మిరప సాగులో నాణ్యమైన, ఆరోగ్యకరమైన నారు మొక్కలను ఎంపిక చేసుకోవడం అత్యంత కీలకమని డా. శ్రీ వెంకట రమణ తెలిపారు. నారు దశలోనే మొక్కలు బలంగా, ఆరోగ్యంగా పెరిగేలా తగిన నీటి యాజమాన్యం, సమతుల్య పోషక యాజమాన్యం పాటించాలని సూచించారు. నర్సరీల్లో అధిక తేమ, నీరు నిల్వ ఉండటం వంటి పరిస్థితులు ఏర్పడకుండా



జాగ్రత్తలు తీసుకోవాలని, మొక్కలపై తెగుళ్లు, పురుగుల లక్షణాలు కనిపించిన వెంటనే గుర్తించి తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. షేడ్‌నెట్ నర్సరీల్లో పర్యావరణ పరిస్థితులను అనుకూలంగా నిర్వహించడం ద్వారా నాణ్యమైన నారును తయారు చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. నారు మొక్కల ఎంపిక నుంచి పొలంలో నాటే వరకు ప్రతి దశలో శాస్త్రీయ పద్ధతులు పాటిస్తే పంట స్థాపన మెరుగుపడి, తరువాతి దశల్లో మొక్కల పెరుగుదల, దిగుబడిపై సానుకూల ప్రభావం ఉంటుందని వివరించారు. బహిరంగ నారుమడుల్లో కూడా నారు మొక్కల ఆరోగ్యం, నేలలో తేమ, నీటి పారుదల, కలుపు మొక్కల నియంత్రణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని రైతులకు సూచించారు. ఆరోగ్యకరమైన నారును మాత్రమే ప్రధాన పొలంలో నాటుకోవాలని, బలహీనమైన లేదా తెగుళ్ల ప్రభావానికి గురైన మొక్కలను నాటకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా హార్టికల్చర్ ఆఫీసర్, బాపట్ల ఉష, విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్, నల్లమోతువారిపాలెం భవాని పాల్గొని గ్రామాల్లోని మిరప నర్సరీల పరిస్థితులను శాస్త్రవేత్తకు వివరించారు. నర్సరీల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని, వాటికి అనుగుణంగా శాస్త్రీయ సూచనలు అందించారు. మిరప సాగులో రైతులు నాణ్యమైన నారును వినియోగించడంతో పాటు, నారు దశ నుంచే శాస్త్రవేత్తలు, ఉద్యాన శాఖ అధికారులు సూచించే సాంకేతిక సలహాలను పాటించాలని ఈ సందర్భంగా అధికారులు సూచించారు. కర్లపాలెం మండలంలో మిరప సాగు విస్తీర్ణం దృష్ట్యా నర్సరీ దశలోనే నాణ్యత ప్రమాణాలను పాటించడం ద్వారా మంచి పంటను సాధించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.

## ఈనెల 13 నుండి 15 వరకు హర్ ఘర్ తిరంగా : కమిషనర్ కె.మయూర్ అశోక్



**గుంటూరు, పెన్ పవర్, ఆగస్ట్ 10 :** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ఈ నెల 13వ నుండి 15వ తేదీ వరకు గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని ప్రతి వార్డ్ సచివాలయం, ప్రభుత్వ కార్యాలయం, ప్రతి ఇంటిపైన త్రివర్ణ పతాకం ఎగరవేయాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి పిలుపులో భాగంగా, జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని, ప్రతి ఒక్కరిలో దేశభక్తిని పెంపొందించేలా, వారిని దేశ అభివృద్ధిలో భాగస్వాములను చేసేందుకు –దేశ నిర్మాణంలో భాగస్వాములు– పేరుతో ప్రత్యేక కార్యక్రమాలు చెప్తున్నట్లు తెలిపారు. ప్రతి ఇంటిపైన త్రివర్ణ పతాకం ఎగురవేయడం, దేశ అభివృద్ధికి సూచనలతో సెల్ఫీలు తీసి పంపించడం చేయవచ్చన్నారు. అలాగే 14వ తేదీన మొక్కలు నాటడం, 14, 15 తేదీల్లో అన్ని ప్రధాన కూడళ్లు, జిఎంసి ప్రధాన కార్యాలయం, మణిపురం, కంకరగుంట ఫ్లైఓవర్స్ ని త్రివర్ణ కాంతులతో అలంకరిస్తామని తెలిపారు. కనుక నగర ప్రజలు హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో విరివిగా పాల్గొని దేశభక్తిని చాటాలని కోరారు.

## చందోలు పెట్రోల్ బంకు వద్ద వాహన తనిఖీలు

**పిట్టలవానిపాలెం మండల పరిధిలోని చందోలు పెట్రోల్ బంకు వద్ద వాహన తనిఖీలు నిర్వహించిన చందోలు ఎస్సై కె. మాధవరావు**



**చందోలు:( పెన్ పవర్ ) ఆగస్టు 10** బాపట్ల జిల్లా పిట్టలవాని పాలెం మండలంలో పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు భద్రత, నేరాల నియంత్రణలో భాగంగా చందోలు పెట్రోల్ బంకు వద్ద పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. చందోలు ఎస్సై కె. మాధవరావు ఆధ్వర్యంలో వాహనాల పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ తదితరాలను పరిశీలించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనం నడిపేటప్పుడు నిబంధనలు ఉల్లంఘించవద్దని ఎస్సై సూచించారు. నిబంధనలు అతిక్రమించిన వాహనదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# అక్రమ ఇసుక రవాణాకు అడ్డాగా పిట్టలవానిపాలెం

### చోద్యం చూస్తున్న మండల అధికారులు
### ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోరా?

**బాపట్ల:( పెన్ పవర్ ), ఆగస్టు 10** బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెం మండలం పిట్టలవానిపాలెం మండలంలో అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణా యథేచ్ఛగా కొనసాగుతున్నాయని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇసుక తరలింపునకు భారీ వాహనాలు రాత్రింబవళ్లు రాకపోకలు సాగిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టంగా ఆదేశిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయని ప్రజలు విమర్శిస్తున్నారు. అక్రమ ఇసుక రవాణాపై ఫిర్యాదులు వస్తున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరోవైపు ఇసుకను తరలిస్తున్న భారీ లారీలు, ఇతర వాహనాల కారణంగా రహదారులపై ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేగంగా దూసుకెళ్తున్న వాహనాలతో ప్రజలు, ద్విచక్ర వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారని చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మండలంలో జరుగుతున్న అక్రమ



ఇసుక తవ్వకాలు, రవాణాపై సమగ్రంగా దర్యాప్తు చేసి, నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రమాదాలు మరింత పెరగకముందే అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

## ట్రాఫిక్ నియంత్రణకు జమ్ములపాలెం ఫ్లైఓవర్‌పై పార్కింగ్‌కు చెక్ పెడుతున్న ట్రాఫిక్ పోలీసులు

**వాహనాల రాకపోకలకు మరింత సౌకర్యం.**
**పోలీసుల చర్యపై హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు**



**బాపట్ల:( పెన్ పవర్), ఆగస్టు 10** బాపట్ల పట్టణంలో ట్రాఫిక్ సమస్యను క్రమబద్ధీకరించడంతో పాటు వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చేపడుతున్న చర్యల్లో భాగంగా జమ్ములపాలెం ఫ్లైఓవర్ బ్రిడ్జిపై వాహనాల పార్కింగ్‌ను నియంత్రించడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రతీరోజు ఉదయం, సాయంత్రం బ్రిడ్జి పై పార్కింగ్ చేపట్టకుండా చర్యలు చేపట్టారు. ఫ్లైఓవర్‌పై వాహనాలు నిలిపివేయడం వల్ల రోడ్డు వెడల్పు తగ్గి ఎదురెదురుగా వచ్చే వాహనాలకు ఇబ్బందులు ఎదురయ్యేవి. అత్యవసర వాహనాలు, ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆర్టీసీ బస్సులు వెళ్లే సమయంలో కూడా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగే పరిస్థితులు ఉండేవి. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ పోలీసులు ఫ్లైఓవర్‌పై పార్కింగ్‌ను నియంత్రించడం మంచి నిర్ణయమని స్థానికులు పేర్కొంటున్నారు.

## చౌక ధరల దుకాణం తనిఖీలు

**బాపట్ల:( పెన్ పవర్ ), ఆగస్టు10**



బాపట్ల జిల్లా, బాపట్ల మండలం గోపాపురం గ్రామంలో వరలక్ష్మి డ్వాక్రా గ్రూప్ తరపున దండమూడి విక్టోరియమ్మ, భర్త లేటు సుందర్ సింగ్ అను వారు నిర్వహిస్తున్న చౌక ధరల దుకాణం నెంబర్ 0757091 ను ఆకస్మిక తనిఖీ చేయగా, అక్కడ ఉండవలసిన నిత్యావసర సరుకుల నిల్వలలో ఈ దిగువ తెలిపిన విధంగా వ్యత్యాసములు కనుగొనడం అయినది. కావున, సదరు డీలర్ పై జిల్లా జాయింట్ కలెక్టర్, బాపట్ల వారికి, అలాగే బాపట్ల రెవెన్యూ డివిజనల్ అధికారి వారికి డీలర్ పై తగు చర్యలు తీసుకొను నిమిత్తం నివేదికలు సమర్పించడం అవుతుంది. ఈ తనిఖీలో సివిల్ సప్లై డిప్యూటీ తహశీల్దార్, బాపట్ల సి.వి.ఎల్. ఫణి కుమార్ తో పాటు గ్రామ రెవెన్యూ అధికారి పులి శ్రీనివాసరావు మరియు మధ్యవర్తులు పాల్గొన్నారు. బియ్యము 39.20 క్వింటాలు తక్కువగా ఉన్నాయి. పంచదార 101 ప్యాకెట్లు తక్కువగా ఉన్నాయి. గోధుమ పిండి 12 ప్యాకెట్లు తక్కువగా ఉన్నాయి. అని అధికారులు తెలియజేశారు.

## ప్రియాంక మృతి ఘటనపై మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ దిగ్భ్రాంతి



**గుంటూరు, పెన్ పవర్, ఆగస్ట్, 10 :** ప్రియాంక మృతి ఘటనపై ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ తీవ్ర దిగ్భ్రాంతి, విచారం వ్యక్తం చేశారు. ప్రియాంక మృతదేహానికి నివాళులు అర్పించేందుకు ఏక్లాస్‌పూర్ వెళ్లిన రాయపాటి శైలజ.. కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి ఘటనకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వాస్తవాలు వెలుగులోకి రావాలని, బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని రాయపాటి శైలజ కోరారు. కేసుకు సంబంధించి నిర్ధారణ కాని సమాచారాన్ని ప్రచారం చేయడం, వదంతులను వ్యాప్తి చేయడం సరికాదని ఆమె సూచించారు.

# అదో అందమైన సినిమా ప్రపంచం

**బాపట్ల:( పెన్ పవర్), ఆగస్టు 10** బాపట్ల ఒకప్పుడు సినిమా చూడటం అంటే... ఈ రోజుల్లోలా ఆన్‌లైన్‌లో టికెట్ బుక్ చేసుకుని, ఏసీలో హాయిగా కూర్చొని సినిమా చూడటం కాదు. అదో యుద్ధం... అదో పండుగ... అదో మధురమైన అనుభవం. అప్పట్లో టికెట్ ధరలు కూడా భలేగా ఉండేవి. నేల -- 60 పైసలు, బెంచి -- ఒక రూపాయి, కుర్చీ -- రూపాయి పావలా. నిజానికి సినిమా చూడ్డానికి టికెట్ దొరకడం గొప్ప కాదు... లోపల కూర్చోడానికి చోటు దొరకడం అసలైన విజయం. థియేటర్ యాజమాన్యానికి ఒకటే సూత్రం. "టికెట్లు అమ్ముతూనే ఉండాలి!" నేలంతా నిండిపోయి, ఒకరి భుజాలపై ఇంకొకరు కూర్చున్నా బుకింగ్ ఆగకూడదు. లోపల తోపులాటలు, అరుపులు, చిన్నపాటి యుద్ధాలు జరిగినా గేట్‌కీపర్ మాత్రం ఏమాత్రం కదిలేవాడు కాదు. అలా టిక్కట్లు కట్ చేస్తూనే ఉండేవాడు. నేల క్లాస్‌లో అయితే కూర్చోడానికి చోటు దొరకక కొందరు తెర ముందు ఉన్న అరుగు మీదే కూర్చుని, కొండంత పెద్దగా కనిపించే హీరో, హీరోయిన్ ల ముఖాల్ని చూస్తూ సినిమా చూసేవారు. సినిమా మొదలయ్యేలోపు ఆడవారి మధ్య జరిగే మాటల యుద్ధాలు, జుట్టు పట్టుకుని కింద పడేసే సంఘటనలు కూడా ఆ రోజుల్లో మామూలే ! సినిమా మొదలైతే మరో లోకం మొదలయ్యేది. హీరో తెరపైకి వచ్చి కత్తి తిప్పితే చాలు ఈలలే ఈలాలు ... ఇక హీరోయిన్ తో పాట మొదలైతే .. వాళ్ళే హీరోల్లా కలలు కనేవారు



అంతలోనే..
"సోడా...గోలీ సోడా..."
"చాయ్ ...కాఫీ "
"జంతికలు ..చెగోడీలు "
"శనగలు..వేడి శనక్కాయలు ."

అంటూ రాగాలాపన చేస్తూ అమ్మేవాళ్ళ గోల. కీచ్ మనె గోలీ సోడా శబ్దం... తుప్పుపట్టిన పావుతో శనగలు కొలిచే తీరు...వీళ్ళ మధ్య పొగరాయుళ్ళు గుప్పు గుప్పుమని పీల్చి వదిలే ఘాటైన దూమపాన వాసనలు ... ఇవన్నీ సినిమాకంటే తక్కువ వినోదం కాదు!

అయితే అసలు హీరోలు మరోటి ఉండేవి ... అవే బెంచీల్లో రాజ్యమేలే నల్లులు. ప్రేక్షకులు కూర్చోగానే కుటుంబ సమేతంగా వచ్చి దాడి చేసేవి. వాటి కాట్లకు, దురద భరించలేక గోక్కుంటుంటే వెనక నుంచి "కూచో... తెర కనిపించడం లేదు!" అనే అరుపులు. కొంతమంది అనుభవజ్ఞులు మాత్రం అగ్గిపుల్ల గీసి బెంచి సందుల్లో తిప్పేవారు. దాంతో కొన్ని నల్లులు వీరమరణం పొందేవి. మిగిలినవి ప్రతీకార యాత్ర మొదలుపెట్టి మరింత గట్టిగా కుట్టేవి. అప్పుడు బెంచీలపై ప్రేక్షకుల డ్యాన్సులు చూస్తే సినిమాలో ఉన్న పాటలకంటే ఎక్కువ వినోదాన్ని కలిగించేవి. బాల్కనీకి వెళ్తే ఇంకో కథ. చిరిగిపోయిన కుర్చీల్లోంచి కొబ్బరి పీచు బయటకు తొంగిచూస్తూ ఉండేది. ఇక్కడ నల్లులు తక్కువే... కానీ మేకులు ఎక్కువ. లేచేటప్పుడు పేంటు గాని ,షర్ట్ గాని, చీర గాని చిరిగి "పర్ర్" మనే శబ్దం వినిపించేది. దెబ్బతో సినిమా చూసిన మజా అంతా పోయేది. ఇక ఫ్యాన్లు అయితే తమదైన స్టైల్‌లో తిరిగేవి. గాలి కంటే "గీక్... గీక్..." అనే శబ్దమే ఎక్కువ. అవి ఊడి తలపై పడకపోతే అదే అదృష్టంగా భావించేవారు. కొన్నిసార్లు మధ్యలో కరెంటు పోతే... థియేటర్ మొత్తం ఈలలతో మార్మోగేది. జనరేటర్లు లేని రోజులు... కరెంటు వస్తే సినిమా... రాకపోతే పాస్ ఇచ్చి "రేపు రండి" అనేవారు. మరుసటి రోజు అదే ఉత్సాహంతో మళ్లీ వచ్చేవారు. ఏడాది తిరిగి తిరిగి ఊరికి వచ్చే పాత ప్రింట్లు... తెరంతా గీతలు... మధ్యలో ఫిల్మ్ తెగిపోవడం... అయినా ప్రేక్షకుల ఆనందం మాత్రం ఏమాత్రం తగ్గేది కాదు. ఈ రోజుల్లో రిక్లైనర్ సీట్లు, డాల్బీ సౌండ్, ఏసీ, ఆన్‌లైన్ బుకింగ్, పాప్‌కార్న్... అన్నీ ఉన్నాయి. కానీ అప్పటి ఆ కేరింతలు... ఆ ఈలలు... ఆ తోపులాటలు... ఆ అమాయకపు ఆనందం మాత్రం కనిపించడం లేదు. సౌకర్యాలు పెరిగాయి... కానీ ఆ సరదాలు తగ్గిపోయాయి . ఎందుకంటే ఆనందం థియేటర్‌లో కాదు... అప్పటి మనుషుల మనసుల్లో ఉండేది.

అందుకే...ఆ రోజుల్లో
అదో అందమైన సినిమా ప్రపంచం... ..అదో చెప్పలేని ఆనందం... నిజంగానే అది ఓ గోల్డెన్ ఎరా!"

ఇష్టమైన జ్ఞాపకాలు వయసు పెరిగే కొద్దీ మరింత మధురమవుతాయి. ఈ కథనం కూడా అలాంటి ఓ పాతకాలపు నవ్వుల ప్రయాణం.

# మహిళలను లక్షాధికారులను చేయడమే లక్ష్యం

**బాపట్ల:( పెన్ పవర్), ఆగస్టు 10:** బాపట్ల మహిళలను లక్షాధికారులను చేయడమే లక్ష్యంతో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, తెలిపారు. డి ఆర్ డి ఏ, మెప్మా, పంచాయితీ శాఖల జిల్లా, మండల స్థాయి అధికారులతో సోమవారం స్థానిక కలెక్టరేట్ నుంచి ఆయన వీక్షణ సమావేశం నిర్వహించారు. పొదుపు మహిళల సాధికారత దిశగా ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందని కలెక్టర్ అన్నారు. ఈ క్రమంలో మహిళలు చేస్తున్న ఉత్పత్తులను గుర్తించాలన్నారు. వినూత్నమైన ఆలోచనలతో యూనిట్ లు స్థాపించడం లక్ష్యంతో క్షేత్రస్థాయి సిబ్బంది పనిచేయాలన్నారు. గానుగ నూనె యూనిట్, బ్యూటీ పార్లర్, గేదెల ఉత్పత్తి, ఫోటో స్టూడియో, జిరాక్స్ సెంటర్, కారంపొడి మిషన్, తదితరమైన ప్రాసెసింగ్ యూనిట్లు వంటివి స్థాపించడానికి ప్రోత్సహించాలన్నారు. మహిళల ఆర్థిక స్థితిగతులు మారితే సాధికారత వెంబడిస్తుందన్నారు. మహిళల లక్షాధికారులు అయ్యేందుకు వారి జీవనోపాధి రెండింతలు కావాలన్నారు. కొల్లూరు, చుండూరు మండలాలలో బ్యాంకు లింకేజీ రుణాలు తక్కువగా ఉండడంపై ఆరా తీశారు. శ్రీనిధి రుణాలు విరివిగా ఇవ్వాలన్నారు. ఉన్నతి పథకం కింద ఎస్సీ, ఎస్టీల లబ్ధిదారులను గుర్తించి పరిశ్రమల స్థాపనకు కృషి చేయాలన్నారు. పి ఎం



ఎస్ ఎం ఈ పథకం కింద రుణాలు విరివిగా ఇవ్వాలని సూచించారు. ఇద్దరం మండలంలో రుణాల పంపిణీ జాప్యంపై నిలదీశారు పద్ధతి మార్చుకొని నిబద్ధతతో పని చేయాలని మండల స్థాయి అధికారులకు కలెక్టర్ మార్గ నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో డి ఆర్ డి ఏ పి డి బి సింగయ్య, మెప్మా పీడీ ఆనందసత్యపాల్, డిపిఓ ప్రభాకర్ రావు, ఎంపీడీవోలు, ఏపీవోలు, ఏపీఎంలు, తదితరులు పాల్గొన్నారు.

## మద్యం మత్తులో బైక్‌ను ఢీకొట్టి ఉడాయించిన వ్యక్తి



**చిలకలూరిపేట , పెన్ పవర్, ఆగస్టు 10 :** చిలకలూరిపేటలో మద్యం మత్తులో అతివేగంగా వాహనం నడుపుతూ మరో బైక్‌ను ఢీకొట్టి ఓ వ్యక్తి పరారైన ఘటన పట్టణంలోని మదర్ థెరిసా కాలనీకి చెందిన యువకులు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా, ఎదురుగా మద్యం మత్తులో దూసుకొచ్చిన మరో బైక్ వారిని బలంగా ఢీకొట్టి, ఆపకుండా అక్కడినుంచి ఉడాయించింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకులను గమనించిన స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్థానికులు.. మద్యం సేవించి ఇతరుల ప్రాణాలను ప్రమాదంలోకి నెడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా రాత్రివేళల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని పోలీసులను కోరుతున్నారు. కాగా, ప్రమాదంలో గాయపడిన వారి ప్రస్తుత పరిస్థితి, పరారైన నిందితుడికి సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

# నేతన్నలకు రూ.25 వేల సాయం

**ఈపురుపాలెంలో సీఎం చంద్రబాబుకు పాలాభిషేకం**

**చీరాల, పెన్ పవర్, ఆగస్టు 10 :** చేనేత కార్మికులకు ప్రభుత్వం రూ. 25 వేల ఆర్థిక సహాయం అందించడంపై హర్షం వ్యక్తం చేస్తూ ఈపురుపాలెం పంచాయతీ కార్యాలయం సెంటర్‌లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించారు. నేతన్నలు సైతం పాలాభిషేకం చేసి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం టీడీపీ ప్రభుత్వం రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ నాయకులు ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీడీపీ సీనియర్ నాయకుడు విన్నకోట నరసింహారావుకు నూతన వస్త్రాలు బహూకరించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కౌతరపు జనార్దనరావు, గుద్దంటి చంద్రమౌళి, గుర్రం వెంకటేశ్వర్లు, గంజి పురుషోత్తం, విన్నకోట జగదీష్, యర్రాకుల ప్రసాద్, అవ్వారు సాంబయ్య, బోయిన కేశవులు, ఆకురాతి ఏడుకొండలు, సంబారు రాఘవ, బూదాటి సాంబయ్య, మునగపాటి నాగరాజు, కర్నేటి



శ్రీను, కొప్పు రంగారావు, కర్నేటి రవి, సయ్యద్ ముంతాజ్, సూరగాని బాలు, పడవల లలిత, ఆకురాతి సుజాత, నందం లావణ్యతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో కొత్త జిల్లా పరిషత్‌లు

**విశాఖపట్టణం, ఆగస్టు 10, పెన్ పవర్:** కొత్త జిల్లా పరిషత్‌లను ఏర్పాటు చేసేందుకు ఏపీ ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. కొత్తగా ఏర్పాటు చేసిన జిల్లాలలో కొత్త జిల్లా పరిషత్‌లు ఏర్పాటు చేసే ఆలోచనలో ఉంది. ప్రస్తుత జిల్లా పరిషత్‌ల పదవీకాలం ఈ నెలాఖరుతో ముగియనుంది. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే కొత్త జిల్లా పరిషత్‌లు ఏర్పాటు చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలిసింది.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలో కొత్త జిల్లా పరిషత్‌లు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రచిస్తోంది. ఈ నెలాఖరు నాటికి ప్రస్తుత జిల్లాపరిషత్ సభ్యుల పదవీకాలం పూర్తి కానుంది. ఈ నేపథ్యంలో పదవీకాలం పూర్తి అయిన తర్వాత కొత్త జిల్లాపరిషత్‌లు ఏర్పాటు చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. కొత్త జిల్లా పరిషత్‌ల ఏర్పాటుపై రాష్టంలోని అన్ని జిల్లా పరిషత్ సీఈవోలతో ప్రభుత్వం సమావేశం కానుంది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే, రాబోయే నెలల్లో కొత్తగా ఏర్పడిన జిల్లాల్లో కొత్త జిల్లా పరిషత్‌లను ఏర్పాటు చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలిసింది. వైసీపీ ప్రభుత్వం జిల్లా పరిషత్ ఎన్నికల తర్వాత, 2022 ఏప్రిల్‌లో కొత్త జిల్లాలను ఏర్పాటు చేసింది. అయితే, పరిపాలనాపరమైన ఇబ్బందులను నివారించడానికి, అప్పటికే ఎన్నికైన జిల్లా పరిషత్ మండళ్లు.. ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన తమ కార్యకలాపాలను కొనసాగించాయి. కొత్తగా ఏర్పడిన జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులు ఇప్పటికీ ఉమ్మడి జిల్లా పరిషత్ సమావేశాలకు హాజరవుతున్నారు.మరోవైపు కొత్త జిల్లాల కోసం ప్రత్యేక జిల్లా పరిషత్‌లను ఏర్పాటు చేసి, వాటికి ప్రత్యేక కార్యాలయ భవనాలను సమకూర్చాలని ప్రస్తుత ప్రభుత్వం ఆలోచిస్తోంది. విశాఖపట్నం జిల్లా పరిషత్ మూడు జిల్లా పరిషత్‌లుగా.. విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజుగా విభజించనున్నారు. అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో కొత్త జిల్లా పరిషత్ కార్యాలయాలను ఏర్పాటు చేయనున్నారు. విశాఖపట్నం జిల్లా పరిషత్ కార్యాలయం మాత్రం ప్రస్తుతం ఉన్న భవనం నుంచే తన కార్యకలాపాలను కొనసాగిస్తుంది.విశాఖపట్నం జిల్లా పరిషత్‌కు చెందిన ఓ సీనియర్ అధికారి వెల్లడించిన వివరాల ప్రకారం.. ప్రస్తుతం ఉన్న ఉద్యోగులలో సుమారు 60 శాతం మందిని 24 మండలాలు కలిగిన అనకాపల్లి జిల్లాకు, 30 శాతం మందిని 11 మండలాలు కలిగిన అల్లూరి సీతారామరాజు జిల్లాకు కేటాయించే అవకాశాలు ఉన్నాయి. మిగిలిన 10 శాతం మందిని కేవలం నాలుగు మండలాలు మాత్రమే ఉన్న విశాఖపట్నం జిల్లాకు కేటాయించే అవకాశాలు ఉన్నాయి. మరోవైపు అనకాపల్లి , అల్లూరి సీతారామరాజు జిల్లాల యంత్రాంగాలు ఇప్పటికే కొత్త జిల్లా పరిషత్ కార్యాలయాల కోసం తగిన భవనాలను, స్థలాలను గుర్తించాయి.

**లోకల్ బాడీ ఎన్నికల తర్వాత కేబినెట్**

మంత్రులు మౌనంగా ఉంటే సహించేది లేదని సీఎం చంద్రబాబు తేల్చి చెప్పారు. ముఖ్యంగా టీడీపీ మంత్రులకు ఆయన ఈ విషయంలో ఇప్పటికే చాలా సార్లు హెచ్చరికలు జారీ చేశారు. అయినప్పటికీ చాలా మంది మంత్రులు మౌనంగా ఉండడం.. కనీసం పన్నెత్తు విమర్శ కూడా చేయకపోవడంతో సీఎం మరోసారి వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఉదయమే టెలీ కాన్ఫరెన్సు నిర్వహించిన సీఎం చంద్రబాబు.. మంత్రులకు వారి బాధ్యతలను గుర్తు చేసినట్టు తెలిసింది.ఫైళ్ల క్లియరెన్సు, శాఖలపై పట్టు విషయంలో రెండున్నరేళ్లు అవుతున్నా.. ఇప్పటికీ ఐదుగురు టీడీపీ మంత్రులు పట్టు పెంచుకోలేక పోయారని చంద్రబాబు తేల్చి చెప్పారు. ఇక, ప్రత్యర్థులు చేస్తున్న దాడిని ఎదుర్కొనడంలో దాదాపు సగం మంది మౌనంగానే ఉంటున్నారని ఆయన పేర్కొన్నారు. ఇంకా.. ప్రతి విషయాన్నీ తాను చెప్పాలంటే కుదరదని.. ఇక నుంచి అయినా.. మిషన్ మోడ్‌తో పనిచేయాలని సూచించారు. ప్రత్యర్థులు రెచ్చిపోతున్నా.. మంత్రులు ఎందుకు మౌనంగా ఉంటున్నారని ప్రశ్నించారు.ఇక, స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మంత్రులకు బాధ్యతలు ఎక్కువగా ఉంటాయని చంద్రబాబు పేర్కొన్నారు. ఒక్క చోట కూడా.. కూటమి పార్టీలు ఓటమి చవి చూడకూడదని స్పష్టం చేశారు. ఎవరూ అలసత్వం ప్రదర్శించవద్దన్నారు. అదే సమయంలో మీడియా ముందుకు రావడం.. ప్రజలకు మంచిని వివరించడం చేయాలని చెప్పారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## రైతుల పంట విరామం

**ఏలూరు, ఆగస్టు 10 పెన్ పవర్:** ఆరుగాలం శ్రమించిన పంట చేతికి అందుతుందన్న దశలో ప్రకృతి వైపరీత్యాల బారినపడి ఖరీఫ్ పంట నాశనం అవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికంతటికి మురుగు కాలువల ఆక్రమణ, విచ్చలవిడిగా ఆక్వా వ్యర్థాలు పంట కాలువల్లోనూ వదులుతుండటం కారణమని రైతులు వాపోతున్నారు. జూలై నెలాఖరు వరకు సక్రమంగా సాగునీరు అందని పరిస్థితి ఉందని చెబుతున్నారు. ఇలా అనేక కారణాలు తీవ్ర ఇబ్బందులు గురిచేస్తున్నాయని, ఈ క్రమంలోనే సాగు చేయలేమంటూ రైతులు విరమణ ప్రకటించారు అల్లవరం మండలం తాడికోన గ్రామంలో వరి రైతులు. ఊడ్చని చేలు వద్ద పంట విరామం ప్రకటిస్తున్నట్లు ఫ్లెక్సీ ఏర్పాటు చేయడంతో చర్చకు దారితీసింది. ఈ క్రమంలోనే తాడికోన గ్రామంలో ఎవ్వరు ఊడ్చేది లేదని రైతులు తేల్చి చెప్పారు. డ్రెయిన్ల ఆక్రమణపై ఎన్నిసార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన కనీసం స్పందించడం లేదని అన్నారు. దీంతో చిన్నపాటి వర్షాలకి పంట పొలాలు ముంపు గురై పంట నాశనం అవుతుందని వాపోతున్నారు. పెట్టిన పెట్టుబడులు దక్కక అప్పుల పాలవుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క విచ్చలవిడిగా ఆక్వా చెరువులు తవ్వి అక్రమ సాగు చేస్తున్న తీరుపై ఫిర్యాదులు చేస్తున్న కనీస చర్యలు తీసుకోవడం లేదంటూ రైతులు మండిపడ్డారు. ఈ పరిస్థితుల్లో పంట విరామం ప్రకటిస్తున్నట్లు తాడికోన రైతులు వెల్లడించారు.అల్లవరం మండలం బెండమూర్లంకలో చారిత్రాత్మకమైన మొదటి పంట విరామ ఉద్యమం 2011లో రైతులు ప్రకటించారు. రైతులకు గిట్టుబాటు ధర లభించకపోవడం, పెట్టుబడి వ్యయం పెరిగిపోవడం, డ్రెయినేజీ సమస్యల వల్ల బెండమూర్లంక రైతులు తొలిసారిగా ఈ వినూత్న ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. ఈ ఉద్యమ ప్రభావం అప్పట్లో దేశవ్యాప్తంగా సంచలనమైంది. దీంతో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం మోహన్ కందా కమిటీ వేసి క్షేత్రస్థాయిలో రైతులు పడుతున్న ఇబ్బందులపై విచారణ చేపట్టించారు. ఇదే తరహాలో కాలువల ఆధునికీకరణ, ధాన్యం బకాయిల ఆలస్యంపై నిరసనగా మళ్లీ 2022 ఖరీఫ్ సీజన్‌లో బెండమూర్లంకతోపాటు అల్లవరం మండలంలోని పలు గ్రామాల్లోని రైతులు పంట విరామం ప్రకటించారు. మళ్ళీ ఇప్పుడు ఇదే మండలంలోని తాడికోన గ్రామం నుంచి పంట విరామం ఉద్యమం ప్రారంభించారు.

## 100 శాతం టెలికాం కనెక్టివిటీ

**విజయవాడ, ఆగస్టు 10, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా కమ్యూనికేషన్ రంగాన్ని పూర్తిస్థాయిలో బలోపేతం చేసేందుకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకమైన అడుగులు వేస్తోంది. రాష్టంలోని ప్రతీ మారుమూల గ్రామానికి, గిరిజన ప్రాంతాలకు సైతం నెట్‌వర్క్ సౌకర్యాన్ని చేర్చడం ద్వారా 100 శాతం టెలికాం కనెక్టివిటీని సాధించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా టెలికాం ఆపరేటర్లను మరియు టవర్ల ఏర్పాటును ప్రోత్సహించేందుకు ఎన్నడూ లేని విధంగా భారీ రాయితీలను, సరికొత్త రాయితీ విధానాన్ని ప్రభుత్వం తెరపైకి తీసుకువచ్చింది.ఈ మెగా ప్రాజెక్టును వేగవంతం చేసేందుకు మొబైల్ టవర్ల ఏర్పాటుకు ఎలాంటి అద్దె లేకుండా ఉచితంగా ప్రభుత్వ భూములను కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనితో పాటు సదరు టెలికాం టవర్లకు అత్యంత తక్కువ ధరకే రాయితీపై విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ శాఖను ఆదేశించింది. టెలికాం ఆపరేటర్ల నుండి వచ్చే ప్రతిపాదనలను ఎప్పటికప్పుడు వేగంగా పరిశీలించి, ఎక్కడా జాప్యం లేకుండా టవర్ల ఏర్పాటుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి.రాష్టంలోని వివిధ ప్రాంతాల్లో టవర్ల ఏర్పాటుకు అవసరమైన ప్రభుత్వ భూములను తక్షణమే గుర్తించి కేటాయించాల్సిందిగా వివిధ శాఖల ప్రభుత్వ కార్యదర్శులను ఐటీ శాఖ కోరింది. అలాగే క్షేత్రస్థాయిలో ఈ భూముల కేటాయింపు ప్రక్రియ వేగంగా పూర్తయ్యేలా ఆయా జిల్లాల కలెక్టర్లు ప్రత్యేకంగా సహకరించాలని రాష్ట్ర ఐటీ రక్షణ శాఖ స్పష్టం చేసింది. డిజిటల్ ఆంధ్రప్రదేశ్ దిశగా ప్రభుత్వం తీసుకున్న ఈ చారిత్రాత్మక నిర్ణయం వల్ల రాష్టంలో ఇంటర్నెట్, మొబైల్ సిగ్నల్స్ లేని ప్రాంతమంటూ లేకుండా పోతుందని, దీనివల్ల గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరియు డిజిటల్ సేవలు మరింత విస్తరిస్తాయని నిపుణులు భావిస్తున్నారు.

## ఉలవపాడులో పునాస మామిడికి డిమాండ్

**ఒంగోలు, ఆగస్టు 10, పెన్ పవర్:** ఏపీలో ఉలవపాడు మామిడి రైతుల పంట పండింది. ఈ సీజన్‌లో దొరికే పునాస రకం మామిడితో భారీ లాభాలు అందుకుంటున్నారు. ఈసారి కేజీ కాయలు రూ.50 వరకు పలుకుతున్నాయి.. దీంతో రైతులు ఆనందంలో ఉన్నారు. ఈ నెలలో ఓనం పండగ కూడా ఉండటంతో మామిడి కాయలకు ఇంకా మంచి ధర వస్తుందని రైతులు ఆశిస్తున్నారు. ఈ ఏడాది కాస్త లాభాలు వస్తాయని చెబుతున్నారు.ఆంధ్రప్రదేశ్‌లో ప్రకాశం జిల్లా ఉలవపాడు మామిడి కాయలు బాగా ఫేమస్. బంగినపల్లి, రసాలు సహా పలు రకాల మామిడి కాయలు సీజన్‌లో దొరుకుతాయి. మార్చి నెలలో సీజన్ మొదలైతే.. జూన్ వరకు కొనసాగుతుంది. ప్రతి ఏటా సీజన్ ముగిశాక కూడా మామిడి రైతులు పునాస రకం కాయల ద్వారా ఆదాయం పొందుతున్నారు. కొన్నేళ్లుగా పునాస కాయలకు గిట్టుబాటు ధరలు లేకపోవడంతో రైతులు ఆందోళనలో ఉన్నారు. ఈ ఏడాది మాత్రం అలా కాదు.. పునాస కాయల ధరలు దుమ్ము రేపుతున్నాయి.. భారీగా లాభాలు వచ్చే అవకాశం ఉందంటున్నారు.ప్రకాశం జిల్లా గుడ్లూరు, ఉలవపాడు మండలాలు సహా అన్ని చోట్లా కలిపి పునాస మామిడిని ఐదువేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ప్రధానంగా బంగినపల్లి, రసాలు, బెంగళూరు రకం కాయల సీజన్ తర్వాత.. జులై, ఆగస్టు నెలల్లో పునాస పంట చేతికి వస్తుంది. నాలుగైదు రోజులుగా ఈ పునాస రకం మామిడి కాయలకు మార్కెట్‌లో గిరాకీ పెరిగింది. కేజీ రూ.50 వరకు పలుకుతోంది.. టన్ను రూ.50వేల వరకు ఉంది. గుడ్లూరు మండలంలో ప్రతి రోజూ నాలుగు టన్నలు వరకు కాయలు చెన్నై, బెంగళూరు సహా ఇతర ప్రాంతాలకు ఎగుమతి అవుతున్నాయి. ఉలవపాడుకు ఈ కాయల్ని తీసుకొచ్చి ఇతర రాష్ట్రాలకు లారీల ద్వారా పంపిస్తున్నారు.ఈ పునాస మామిడి కాయలు కేరళంలో నిర్వహించే ఓనం పండగకు వినియోగిస్తుంటారు. అందుకే కేరళం రాష్ట్రానికి ఎగుమతులు ఎక్కువగా పునాస కాయల్ని ఎగుమతి చేస్తుంటారు. ఆగస్టు నెలాఖరులో ఈ పండగ ఉండటంతో.. కాయల ధర మరింత పెరిగే అవకాశం ఉందని, లాభాలు వస్తాయని రైతులు ఆనందంలో ఉన్నారు. ఈ ఏడాది బంగినపల్లి దిగుబడి బావుంది.. కానీ ధరలు మాత్రం లేవు. సీజన్ ముగిసే సమయంలో టన్ను రూ.60వేలు కూడా పలకలేదు. దీంతో రైతులు పెట్టుబడులు కూడా రాలేదని నిరాశ చెందారు.. ఈసారి పునాస రకం మామిడి కాయలకు మంచి ధర రావడంతో ఆ నష్టాల నుంచి కాస్త బయటపడతామని చెబుతున్నారు.

# పిఠాపురంలో రోడ్లకు మహర్దశ

**కాకినాడ, ఆగస్టు 10, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిఠాపురం నియోజకవర్గాన్ని దేశంలోనే ఒక ఆదర్శవంతమైన మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నారు. ఇందులో భాగంగా నియోజకవర్గవ్యాప్తంగా పల్లెల నుంచి పట్టణాల వరకు మౌలిక వసతుల కల్పనకు, ముఖ్యంగా రహదారుల పునర్నిర్మాణానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. కేవలం రోడ్ల నిర్మాణం, మరమ్మతుల కోసమే ఏకంగా రూ. 200 కోట్లకు పైగా నిధులను వెచ్చించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, సాస్కీ, రోడ్లు భవనాల శాఖ, పంచాయతీరాజ్ శాఖల భాగస్వామ్యంతో మొత్తం 307 కిలోమీటర్ల మేర నూతన రహదారుల నిర్మాణ ప్రణాళికలు రూపొందించారు. ఇప్పటికే రూ. 100 కోట్ల అంచనా వ్యయంతో 152 కిలోమీటర్ల మేర 611 రోడ్ల నిర్మాణ పనులు విజయవంతంగా పూర్తయ్యాయి. నిర్ణీత లక్ష్యంలో దాదాపు 80 శాతం పనులు పూర్తి కావడంతో పిఠాపురం నియోజకవర్గంలో రవాణా వ్యవస్థ రూపురేఖలు మారిపోయి గ్రామాల్లో కొత్త కళ సంతరించుకుంది.రహదారుల నిర్మాణంలో ప్రజల, రైతులు, మత్స్యకారుల అవసరాలను ప్రాతిపదికగా తీసుకున్నారు. దశాబ్దాలుగా తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్న ఉప్పాడ తీరప్రాంత మత్స్యకారుల కోసం ప్రత్యేకంగా జెట్టీకి వెళ్లే మార్గంలో గ్రావెల్ రోడ్డును నిర్మించి వారి రవాణా కష్టాలను తీర్చారు. అంతేకాకుండా సముద్ర కోత వల్ల ఇళ్లను కోల్పోయిన మాయాపట్నం మత్స్యకారులకు సుబ్బంపేట సమీపంలో కల్పించిన కొత్త మాయాపట్నం పునరావాస కాలనీలో 13 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ రూ. 1.52 కోట్లతో 1.5 కిలోమీటర్ల సీసీ రోడ్లు, 2.8 కిలోమీటర్ల డ్రెయినేజీ వ్యవస్థను ఏర్పాటు చేశారు.కొత్తసూరాడపేట పునరావాస కాలనీకి సైతం రూ. 93 లక్షలతో 1.6 కిలోమీటర్ల సిమెంటు రోడ్లు నిర్మించి, ప్రధాన రహదారికి అనుసంధానం చేశారు. తుపాన్ల ధాటికి పూర్తిగా కొట్టుకుపోయిన యు.కొత్తపల్లి మండలంలోని అమరవిల్లి-రామన్నపాలెం బీచ్ రోడ్డును రూ. 88 లక్షలతో పునర్నిర్మించడం ద్వారా వేలాది మంది ప్రజలకు, స్థానిక బషీర్ బీబీ ఆలయ దర్శనానికి వెళ్లే



భక్తులకు మార్గం సుగమమైంది.సెజ్ పరిధిలో ఉండి ఏళ్ల తరబడి అభివృద్ధికి దూరమైన ముమ్మడివారిపాడు గ్రామానికి రూ. 79.70 లక్షలతో శాశ్వత రహదారిని అందుబాటులోకి తెచ్చారు. కొత్తపల్లి గ్రామంలో ప్రజల చిరకాల కోరికైన శ్మశాన వాటిక దారిని రూ. 26.30 లక్షలతో సీసీ రోడ్డుగా మలిచారు. కొండెవరం గ్రామ పరిధిలోని పిఠాపురం-ఉప్పాడ ఆర్ అండ్ బీ రోడ్డును రూ. 1.22 కోట్ల ఉపాధి నిధులతో పవన్ కళ్యాణ్ యుద్ధప్రాతిపదికన పూర్తి చేయించారు. మరోవైపు దశాబ్దాలుగా గుంతలమయమై నరకప్రాయంగా మారిన గొల్లప్రోలు మండలం వెన్నెపూడి జీఎస్టీ ప్రధాన రహదారిని రూ. 85 లక్షలతో, గొల్లప్రోలు-తాటిపర్తి పుంత రోడ్డును రూ. 1.46 కోట్లతో పునర్నిర్మించి రైతులకు, ప్రయాణికులకు ఊరటనిచ్చారు. చిత్రాడ గ్రామంలోని ఈబీసీ కాలనీ వాసుల కోసం రూ. 3 కోట్లతో సీసీ రోడ్లు, ఆధునిక డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టడంతో పాటు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల భద్రతకై రూ. 50 లక్షలతో ప్రహరీ గోడను నిర్మించారు.వ్యవసాయ రంగ సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ 'పల్లెపండుగ 2.0' ద్వారా పంట పొలాల మధ్య ఉన్న డొంక రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. పి.రాయవరం, బి. ప్రత్తిపాడు గ్రామాల్లో కోటి రూపాయలకు పైగా వెచ్చించి 3 కిలోమీటర్ల మేర నిర్మించిన గ్రావెల్ రోడ్లు దాదాపు 200 ఎకరాలకు పైగా వ్యవసాయ భూములకు మెరుగైన రవాణా సదుపాయాన్ని కల్పించాయి. అభివృద్ధి పనులపై నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ.. ప్రస్తుతం పురోగతిలో ఉన్న 70 కిలోమీటర్ల పెండింగ్ రోడ్డు పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రహదారుల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాల విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని, అధికారులు నిరంతరం పర్యవేక్షణ జరపాలని స్పష్టం చేశారు

# జనాలు ఓట్లు రాలుస్తాయా.....

**విజయవాడ, ఆగస్టు 10, పెన్ పవర్:** వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి పర్యటనలు ఎప్పుడూ రాజకీయంగా చర్చనీయాంశంగానే మారుతుంటాయి. ఆయన ఎక్కడికి వెళ్లినా పెద్ద ఎత్తున ప్రజలు కనిపించడం సహజమే. గతంలో పార్టీ నాయకులు ప్రత్యేకంగా జనసమీకరణ చేపట్టేవారనే విమర్శలు వినిపించేవి. అయితే ఇప్పుడు పరిస్థితి మారిందని వైసీపీ నాయకులు చెబుతున్నారు. జగన్ పర్యటనలకు ప్రజలు స్వచ్ఛందంగా వస్తున్నారని, ఎవరినీ ప్రత్యేకంగా తీసుకురావాల్సిన అవసరం లేదని వారు వాదిస్తున్నారు. ఇటీవల శ్రీకాకుళం తూర్పుగోదావరి జిల్లాల్లో జరిగిన పర్యటనల్లో కనిపించిన జనసందోహాన్ని ఇందుకు ఉదాహరణగా చూపిస్తున్నారు.అయితే ఈ పరిస్థితిని మరో కోణంలో కూడా రాజకీయ విశ్లేషకులు పరిశీలిస్తున్నారు. పెద్ద ఎత్తున జనాలు రావడం రాజకీయంగా బలం చూపించినా, భద్రతా పరంగా మాత్రం సవాళ్లు పెంచుతుందని వారు అభిప్రాయపడుతున్నారు. భారీగా ప్రజలు చేరడం వల్ల తొక్కిసలాటలు, ఆస్తి నష్టం లేదా అనుకోని ఘటనలు జరిగే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. అలాంటి సంఘటనలు భవిష్యత్తులో రాజకీయంగానే కాకుండా చట్టపరంగానూ ఇబ్బందులు తీసుకురావచ్చని అంచనా వేస్తున్నారు.ఇటీవల తూర్పుగోదావరి జిల్లాలో జరిగిన పర్యటన సందర్భంగా ఒక మహిళకు చెందిన దుకాణం దెబ్బతినడం, పొగాకు బేళ్లపై కొందరు ఎక్కి తొక్కడం వంటి ఘటనలు చర్చకు వచ్చాయి. అలాగే శ్రీకాకుళం జిల్లాలో మహిళా ఎస్సై విధులు నిర్వహిస్తున్న సమయంలో జరిగిన తోపులాట కూడా వివాదాస్పదమైంది. ఈ సంఘటనలకు సంబంధించిన వీడియోలు, వివరాలను అధికార వర్గాలు ప్రత్యర్థి పార్టీ నాయకులు నమోదు చేస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.గతంలో గుంటూరు జిల్లాలో జరిగిన మరో ఘటన కూడా తరచూ ప్రస్తావనకు వస్తోంది. ఒక పార్టీ కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించేందుకు జగన్ వెళ్లిన సమయంలో జరిగిన రద్దీలో మరో కార్యకర్త వాహనం కింద పడి ప్రాణాలు కోల్పోయిన సంఘటనపై కేసు నమోదైంది. ఇలాంటి సంఘటనలు రాజకీయ కార్యక్రమాల్లో భద్రత ఎంత ముఖ్యమో గుర్తు చేస్తున్నాయి.ఇదే తరహా ఘటనలు దేశంలోని ఇతర రాష్ట్రాల్లో కూడా చోటుచేసుకున్నాయి. తమిళనాడులో విజయ్ నిర్వహించిన భారీ ర్యాలీ సందర్భంగా తొక్కిసలాట జరిగి పలువురు ప్రాణాలు కోల్పోయిన విషయం దేశవ్యాప్తంగా చర్చకు వచ్చింది. అలాగే కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర సమయంలో కూడా భారీ జనసందోహం కారణంగా కొన్ని ఇబ్బందులు ఎదురయ్యాయి. బీహార్ లో ప్రశాంత్ కిశోర్ పాదయాత్ర సందర్భంగా భద్రతా సమస్యలు వెలుగులోకి వచ్చాయి.ఈ పరిణామాల నేపథ్యంలో రాజకీయ సభలు, ర్యాలీలు, పాదయాత్రల నిర్వహణలో భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యే కార్యక్రమాలపై ప్రభుత్వం, పోలీసులు మరింత అప్రమత్తంగా వ్యవహరించే అవకాశముంది. భవిష్యత్తులో జగన్ చేపట్టే పాదయాత్ర లేదా ఇతర భారీ కార్యక్రమాలకు అనుమతులు, భద్రతా నిబంధనల విషయంలో మరింత కఠినమైన షరతులు విధించే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రాజకీయ బలం చూపించడమే కాకుండా ప్రజల భద్రతను కాపాడటం కూడా అన్ని పార్టీల ప్రధాన బాధ్యత అనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**జైలు కెళ్తే టిక్కెట్ గ్యారంటీ**

వైసీపీలో ఇపుడు కొత్త చర్చ సాగుతోంది. పార్టీ కోసం జనంలో ఉండి పోరాడామని ఎవరు చెప్పినా దానికి అధికారిక పత్రం ఏమి ఉంటుంది అన్నదే అంతా అనుకుంటారు. అదే ఏదో విధంగా జనంలోకి వచ్చి పోరాటాలు చేస్తే ఆ మీదట ఎటూ పోలీసులు కేసు కడతారు, అలా అరెస్టు అయి జైలు పాలు అయితే అది నేరుగా అధినాయకత్వం దృష్టిలోకి వెళ్తుందని తప్పకుండా అలాంటి వారికే టికెట్ దక్కుతుందని అంటున్నారు. వైసీపీలో ఈ అరెస్టులు జైళ్ళు ఇలా ఎంతో మంది నాయకులు గత రెండేళ్ళుగా ఎదుర్కొంటూ వచ్చారు, ఇపుడు మరింత మంది జైలులో ఉన్నారు, ఇంకొంతమంది జైలుకు వెళ్ళే బాటలో ఉన్నారని అంటున్నారు. వైసీపీ నేతలు ఎవరైనా అరెస్టు అయితే ఆ పార్టీ అధినాయకత్వం నుంచి భారీ రియాక్షన్ వస్తోంది. నేరుగా జగన్ ట్వీట్ చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం మీద విమర్శలు కూడా అందులో చేస్తున్నారు. అంతే కాదు వారికి పరామర్శలు ఆ మీదట భారీ ప్రచారం వంటివి వెంటవెంటనే జరిగిపోతున్నాయి. ఇటీవల కాలంలో చూసుకుంటే శ్రీకాకుళం జిల్లాలో మాజీ మంత్రి సీదరి అప్పలరాజు అరెస్టు అయితే జగన్ పరామర్శకు జైలు దాకా వెళ్ళి వచ్చారు. ఆ తరువాత కర్నూలు జిల్లాకు చెందిన ఎమ్మెల్యే విరూపాక్షని అరెస్టు చేశారు. ఇపుడు శ్రీకాకుళంలో ఆముదాలవలస ఇంచార్జి చింతాడ రవి కుమార్ ని అరెస్టు చేశారు. దీంతో వైసీపీ నేతలు అంతా ఆయనకు సంఘీభావం ప్రకటించారు. అధినాయకత్వం కూడా దీని మీద ఘాటుగా స్పందించింది. ఆముదాలవలస అంటే మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం అందరికీ గుర్తుకు వస్తారు. అలాంటి చోట 2024 ఎన్నికల తరువాత వైసీపీ అధినాయకత్వం చేసిన మార్పులలో భాగంగా యువ నేత అయిన చింతాడ రవికుమార్ కి ఇంచార్జి బాధ్యతలు అప్పగించింది. ఆయన నాటి నుంచి పార్టీని యాక్టివ్ గా చేస్తున్నారు. జగన్ తాజా శ్రీకాకుళం పర్యటనలో ఆయన భారీ జనాలతో తరలి వచ్చారు. ఈ సందర్భంగానే మహిళా ఎస్సైతో జరిగిన గొడవలో ఆయనను అరెస్టు చేశారు. ఇక ఇపుడు ఆయనకు ఆముదలవలస టికెట్ ఖరారు అయినట్లే అని అంటున్నారు. మరో వైపు భూ కబ్జా ఆరోపణల మీద మాజీ స్పీకర్ కుటుంబం ఇబ్బందులు పడుతోంది. దాంతో కూడా చింతాడ రవి కుమార్ కి కలసి వచ్చింది అని అంటున్నారు.

# ఐసీసీపై మండిపడుతున్న చిన్న జట్లు.. అసలేమిటీ వరల్డ్ కప్ ఫార్మాట్ వివాదం?

**పురుషుల వన్డే ప్రపంచకప్ క్వాలిఫికేషన్ ఫార్మాట్‌లో మార్పులు**

**ఐసీసీ నిర్ణయంపై స్కాట్లాండ్, నెదర్లాండ్స్ బోర్డుల తీవ్ర అసంతృప్తి**

**చిన్న జట్లకు అవకాశాలు తగ్గించేలా కొత్త నిబంధనలు ఉన్నాయని ఆరోపణ**

**కనీస సమాచారం లేకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారని విమర్శ**

**నిర్ణయంపై పునరాలోచించాలని ఐసీసీని కోరిన అసోసియేట్ దేశాలు**

**హైదరాబాద్ పెన్ పవర్:** అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) తీసుకున్న ఒక అనూహ్య నిర్ణయం క్రికెట్ ప్రపంచంలో తీవ్ర దుమారం రేపుతోంది. పురుషుల వన్డే ప్రపంచకప్ క్వాలిఫికేషన్ ప్రక్రియలో, టోర్నమెంట్ ఫార్మాట్‌లో ఆకస్మికంగా మార్పులు చేయడంపై స్కాట్లాండ్, నెదర్లాండ్స్ క్రికెట్ బోర్డులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఇది అసోసియేట్ దేశాల (చిన్న జట్లు) క్రికెట్ అభివృద్ధికి పెద్ద దెబ్బ అని, ప్రపంచవ్యాప్తంగా ఆటను విస్తరించే ప్రయత్నాలకు ఇది గొడ్డలిపెట్టు అని హెచ్చరించాయి.



**ఏమిటీ కొత్త మార్పులు?**

గత జులైలో ఎడిన్‌బర్గ్‌లో జరిగిన ఐసీసీ వార్షిక సమావేశం తర్వాత ఈ మార్పులను ప్రకటించారు. వాస్తవానికి, ఈ టోర్నమెంట్‌లో 14 జట్లు పాల్గొనాలి. వాటిని ఏడేసి జట్లుగా రెండు గ్రూపులుగా విభజించి, ఆ తర్వాత 'సూపర్ సిక్స్' దశ నిర్వహించాల్సి ఉంది. కానీ, ఐసీసీ ఇప్పుడు 'సూపర్ సిరీస్', 'సూపర్ 7' అనే కొత్త దశలను ప్రవేశపెట్టింది.

ఈ కొత్త విధానం ప్రకారం, క్వాలిఫయింగ్ రౌండ్‌లో చివరి మూడు స్థానాల్లో (12, 13, 14) నిలిచిన జట్లు మొదట 'సూపర్ సిరీస్' ఆడతాయి. ఇందులో గెలిచిన ఒక్క జట్టు మాత్రమే తర్వాతి దశకు అర్హత సాధిస్తుంది. ఆ తర్వాత, టాప్ 11 జట్లతో కలిసి మొత్తం 12 జట్లను ఆరేసి చొప్పున రెండు గ్రూపులుగా విభజిస్తారు. ప్రతి గ్రూప్ నుంచి టాప్ 3 జట్లతో పాటు, ఆ తర్వాత ఉత్తమ ప్రదర్శన కనబరిచిన మరో జట్టుతో కలిపి మొత్తం ఏడు జట్లు 'సూపర్ 7' దశలో ఆడతాయి. ఈ ఏడు జట్ల మధ్య జరిగే రౌండ్ రాబిన్ మ్యాచ్‌ల ఆధారంగా సెమీ ఫైనలిస్టులను నిర్ణయిస్తారు.

**చిన్న జట్లకు నష్టమా?**

ఈ మార్పుల వల్ల అసోసియేట్ దేశాలు తీవ్రంగా నష్టపోతాయని స్కాట్లాండ్, నెదర్లాండ్స్ బోర్డులు ఆందోళన వ్యక్తం చేశాయి. టోర్నమెంట్ ప్రారంభానికి కేవలం 18 నెలల ముందు ఇలాంటి కీలక మార్పులు చేయడం దారుణమని సంయుక్త ప్రకటనలో పేర్కొన్నాయి. ముఖ్యంగా పరిమిత వనరులతో నడిచే చిన్న దేశాలపై ఇది పెను భారం మోపుతుంది. ఏళ్ల తరబడి ఒకే క్వాలిఫికేషన్ విధానం ఉంటుందని నమ్మి, అందుకు అనుగుణంగా ప్రణాళికలు, శిక్షణ, ఆర్థిక ఏర్పాట్లు చేసుకున్న జట్లకు ఈ ఆకస్మిక మార్పులు కోలుకోలేని దెబ్బ. వారి ప్రణాళికలన్నీ తలకిందులవుతాయి. కొత్త ఫార్మాట్‌కు అలవాటుపడటానికి, వ్యూహాలు మార్చుకోవడానికి సమయం ఉండదు. ఇది వారిపై అదనపు ఆర్థిక, నిర్వహణ ఒత్తిడిని పెంచుతుంది. ప్రపంచకప్‌లో ఆడే అవకాశం వస్తేనే స్పాన్సర్లు, ప్రభుత్వాల నుంచి నిధులు, యువ ఆటగాళ్లలో స్ఫూర్తి వస్తాయి. కానీ, అర్హత సాధించే మార్గాన్ని ఇంత కఠినతరం చేస్తే, ఆ దేశాల్లో క్రికెట్ అభివృద్ధి కుంటుపడుతుంది.

**ఐసీసీ తీరుపై తీవ్ర విమర్శలు**

"క్రికెట్‌ను ప్రపంచవ్యాప్తంగా విస్తరించాలని చెబుతూనే, వర్ధమాన దేశాలకు అవకాశాలు తగ్గించడం తప్పుడు సంకేతాలు పంపుతుంది. కనీసం మాతో చర్చించకుండా, మా అభిప్రాయాలు తీసుకోకుండా ఇంత పెద్ద నిర్ణయం ఎలా తీసుకుంటారు?" అని బోర్డులు ప్రశ్నించాయి. ఈ నిర్ణయాల వెనుక పారదర్శకత లోపించిందని, ఇది అంతర్జాతీయ క్రికెట్ సమగ్రతను దెబ్బతీస్తుందని ఆరోపించాయి. ఈ మార్పుల గురించి ఎడిన్‌బర్గ్ సమావేశంలో తమకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని, ఇది తమకు పిడుగుపాటులాంటి వార్త అని ఓ అసోసియేట్ దేశ అధికారి తెలిపారు. మార్పుల ప్రకటన తర్వాత ఐసీసీతో రెండుసార్లు సమావేశమైనా, లిఖితపూర్వకంగా ఎలాంటి స్పష్టత ఇవ్వలేదని, రెండు వారాలుగా ఐసీసీ నుంచి ఎటువంటి స్పందన లేకపోవడం నిరాశపరిచిందని, ఇది తమను అగౌరవపరచడమేనని ఆవేదన వ్యక్తం చేశాయి. గతంలో అసోసియేట్ దేశాలు పెద్ద జట్లను ఓడించి సృష్టించిన సంచలనాలు టోర్నమెంట్‌కే వన్నె తెచ్చాయని గుర్తుచేశాయి. ఆటలో ప్రతిభే గెలవాలనే సూత్రానికి ఈ మార్పులు విరుద్ధమని పేర్కొన్నాయి. ఐసీసీ వెంటనే ఈ విషయంపై అసోసియేట్ సభ్యులతో చర్చలు జరిపి, ప్రపంచ క్రికెట్ ప్రయోజనాలను కాపాడాలని ఆ బోర్డులు డిమాండ్ చేశాయి.

# హార్దిక్ పాండ్యా కోసం CSK, KKR మాస్టర్ ప్లాన్.. ఈ ఆల్ రౌండర్ అవసరం ఏవరికి .?



**హైదరాబాద్ పెన్ పవర్:** క్రికెట్ ప్రపంచంలో ఎప్పుడూ లేని విధంగా ఇప్పుడు ఒకే ఒక్క న్యూస్ హాట్ టాపిక్‌గా మారింది. అదే ఐపీఎల్ స్టార్ ఆల్‌రౌండర్, ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా ట్రేడింగ్ డీల్ రూమర్స్. గత కొన్ని సీజన్లుగా ముంబై జట్టు ఆశించిన స్థాయిలో రాణించకపోవడంతో, హార్దిక్ పాండ్యా ఫ్రాంచైజీని వీడనున్నారనే వార్తలు క్రికెట్ వర్గాల్లో తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తున్నాయి.

ఇండియన్ ప్రీమియర్ లీగ్ ట్రేడ్ విండోలో భాగంగా, ఈ విధ్వంసకర ఆల్‌రౌండర్‌ను సొంతం చేసుకునేందుకు ఐపీఎల్‌లోని రెండు పవర్ పౌస్ జట్లు తీవ్రంగా పోటీపడుతున్నట్లు తెలుస్తోంది. అందులో మొదటిది ఐదుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన చెన్నై సూపర్ కింగ్స్ (జూఖ) కాగా, రెండోది కోల్‌కతా నైట్ రైడర్స్ (ఖఖ=). ముంబై ఇండియన్స్ నుంచి హార్దిక్‌ను దక్కించుకోవడానికి సీఎస్‌కే భారీ ప్లేయర్ స్వాప్ డీల్‌ను తెరపైకి తెచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. శివమ్ దూబేతో పాటు మరికొందరు ఆటగాళ్లు లేదా భారీ నగదుతో కూడిన ప్యాకేజీని ముంబైకి ఆఫర్ చేసేందుకు చెన్నై సిద్ధమవుతున్నట్లు సమాచారం. మరోవైపు, కేకేఆర్ కూడా కెప్టెన్సీ బాధ్యతలను అప్పగించే లక్ష్యంతో హార్దిక్ ట్రేడింగ్ రేసులో గట్టి పోటీ ఇస్తోంది. అయితే, భారత మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ తన యూట్యూబ్ ఛానెల్‌లో ఈ ట్రేడింగ్ రూమర్లపై ఆసక్తికరమైన విషయాలు వెల్లడించారు. ముంబై ఇండియన్స్ లాంటి అగ్రశ్రేణి ఫ్రాంచైజీ తమ ప్రత్యర్థులైన సీఎస్‌కే లేదా కేకేఆర్‌లను మరింత బలపరిచేందుకు హార్దిక్‌ను సులభంగా వదులుకుంటుందా అనే ప్రశ్న ఇప్పుడు కీలకంగా మారింది. ముంబై మేనేజ్‌మెంట్ ఎలాంటి ప్రతిపాదన లేకుండా ఈ డీల్‌కు ఒప్పుకునే అవకాశం లేదని, కేవలం తమ జట్టుకు సమానమైన లేదా అంతకంటే మెరుగైన ప్రయోజనం చేకూరితేనే ఈ ట్రేడ్ సాధ్యమవుతుందని క్రికెట్ నిపుణులు భావిస్తున్నారు. ప్రస్తుతానికి అధికారిక ప్రకటన వెలువడనప్పటికీ, ఈ మెగా ట్రేడింగ్ వార్ ఐపీఎల్ వేలానికి ముందే వాతావరణాన్ని వేడెక్కించింది. మరి ఈ ఉత్కంఠ పోరులో హార్దిక్ పాండ్యా భవిష్యత్తు ఎటువైపు మొగ్గు చూపుతుందో వేచి చూడాలి.

# గోల్ కొట్టిన సంబరంలో టన్నెల్‌లో పడిపోయిన బ్రెజిల్ ఫుట్ బాల్ ప్లేయర్..



**హైదరాబాద్ పెన్ పవర్:** ఫుట్ బాల్ గేమ్ సందర్భంగా ఒక ప్లేయర్ గోల్ కొడితే ఎంత సంబరం ఉంటుందే ఇటీవలే ఫిఫా వరల్డ్ కప్ చూసినోళ్లకు అర్థం అవుతుంది. వరల్డ్ కప్ అయినా.. చిన్న లీగ్ మ్యాచ్ అయినా అంతే కసితో ఆడుతుంటారు ఫుట్ బాల్ ప్లేయర్లు. గోల్ చేస్తే మ్యాచ్ గెలిచినంత ఆనందం పొందే ప్లేయర్ల సెలబ్రేషన్స్ వేరే లెవెల్ లో ఉంటాయి. అలాంటి సెలబ్రేషన్సే ఈ ప్లేయర్ పాలిట విషాదంగా మారాయి. బ్రెజిల్ టాప్ ఫ్లైట్ ఫుట్ బాల్ కాంపిటిషన్ సందర్భంగా.. కొరిటిబా డిఫెండర్ జేసీ మరన్హావో గోల్ కొట్టిన ఆంనదంలో టన్నెల్ లో పడిపోవడం అందరినీ షాకింగ్ కు గురిచేసింది. పిచ్ కు పక్కనే ఉన్న టన్నెల్ లో పడిపోవడంతో మ్యాచ్ ఆందోళన కరంగా ముగిసింది.

బ్రెజిల్ సిరీ–ఎ మ్యాచ్ లో భాగంగా కేప్ కోయెన్స్ టీమ్ పై కొరిటిబా 41వ నిమిషంలో కొట్టిన గోల్ తో 2–0 తేడాతో గెలుపు దిశగా దూసుకెళ్లింది. గోల్ కొట్టిన సంబరంలో బాల్ చేతబట్టిన ప్లేయర్ జేసీ.. తన సపోర్టర్స్ వైపు పరిగెత్తాడు. సెలబ్రేషన్స్ లో భాగంగా పిచ్ గోడను దూకడంతో పక్కనే ఉన్న సొరంగంలోకి పడిపోయాడు. ఆ తర్వాత సెలబ్రేషన్స్ ఆపకుండా సొరంగం నుంచి బయటకు వచ్చి అదే రేంజ్ లో సెలబ్రేషన్స్ చేశాడు. ఆ తర్వాత మ్యాచ్ కూడా ఆడాడు. అయితే యాంకిల్ (కాలి చీలమండ) విరిగిపోవడంతో మ్యాచ్ నుంచి సబ్ స్టిట్యూట్ చేశారు. జేసీ లేకపోయినా.. కొరిటిబా టీమ్.. కేప్ కొఎన్స్ పై 2–1 తేడాతో గెలిచింది.

**పిచ్ పక్కన సొరంగం ఎందుకు..?**

ఫుట్ బాల్ లో పిచ్ కు డ్రెస్సింగ్ రూమ్ ను కనెక్ట్ చేస్తూ టన్నెల్ ఉంటుంది. ప్లేయర్లు డ్రెస్సింగ్ రూమ్ నుంచి నేరుగా టన్నెల్ ద్వారా పిచ్ కు చేరుకుంటారు. 2014 లో కూడా ఇలాంటి ఘటనే ఒకటి జరిగింది. క్యామెరూన్ స్ట్రైకర్ జోయెల్ కూడా అప్పట్లో బ్యారియెర్స్ పై నుంచి జంప్ చేయడంతో టన్నెల్ పడిపోయాడు. ఆ మ్యాచ్ లో కొరిటిబా సవో పావ్లో టీమ్ పై 3–1 తేడాతో గెలిచింది. ఇద్దరూ పడిన టన్నెల్ ఇదే కావడం గమనార్హం. అనూహ్యంగా జరిగినా.. ఇద్దరు ప్లేయర్లు ఒకే టన్నెల్ పడిపోవడం ఆశ్చర్యం. 2014 తర్వాత మరో 12 ఏళ్లకు అదే టన్నెల్ మరో ప్లేయర్ పడటం యాదృచ్ఛికంగా ఉందని బ్రెజిల్ జర్నలిస్ట్ లియోనార్డో మెండెస్ జూనియర్ అన్నారు.

# ఫౌజీ నుంచీ గూస్ బంప్స్ తెప్పించే న్యూస్.. 3 వారాల పాటూ.. సినిమాకే హైలెట్!






రెబల్ స్టార్ ప్రభాస్ నుండి ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూస్తున్న చిత్రం 'ఫౌజీ'. 'సీతారామం' వంటి బ్యూటిఫుల్ లవ్ స్టోరీ తో ప్రేక్షకులను ఆకట్టుకున్న ప్రముఖ డైరెక్టర్ హను రాఘవపూడి.. ఈసారి భారతదేశానికి స్వాతంత్రం రాక పూర్వం ఒక సైనికుడి గాథతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా.. ప్రముఖ సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్ ఇమాన్వి తొలిసారి వెండితెరకు పరిచయమవుతూ ప్రేక్షకుల ముందుకు రాబోతున్న చిత్రం ఫౌజీ.

**పలుమార్లు వాయిదా పడ్డ ఫౌజీ**

నిజానికి ఆగస్టు 14వ తేదీనే ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రావాల్సి ఉండగా.. ఇప్పటికీ పలుమార్లు వాయిదా పడుతూ వస్తోంది. ఇంకా ఈ సినిమా షూటింగ్ కొంత భాగం మిగిలి ఉండడం గమనార్హం. ఇలాంటి సమయంలో ఈ సినిమా నుంచి ఈ మధ్య అప్డేట్స్ వదులుతూ సినిమాపై అంచనాలు పెంచుతున్నారు మేకర్స్. అందులో భాగంగానే ఈ సినిమా షూటింగ్ గత కొద్ది రోజులుగా హైదరాబాద్లోని కోకాపేటలో షూటింగ్ జరిగింది. ఒక దేవాలయంలో బ్రాహ్మణులు వేడుక చేసుకుంటుండగా.. బ్రిటీషర్స్ సైనికులు వచ్చి భయభ్రాంతులకు గురి చేస్తున్న సమయంలో బ్రాహ్మణుడి గెటప్లో ప్రభాస్ వచ్చి వారిని కాపాడే సన్నివేశాన్ని ఇటీవల చిత్రీకరించినట్లు సమాచారం.

అప్పుడు అదే హైదరాబాదులోని ఆర్ ఎఫ్ సి (రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్) లో భారీ యాక్షన్ సీక్వెన్స్ ను చిత్రీకరిస్తున్నారు. సుమారుగా 3 వారాల పాటు ఇక్కడ షూటింగ్ కొనసాగుతుందని సమాచారం. పైగా ఈ సీక్వెన్స్ సినిమాకే హైలైట్ గా ఉంటుందట. మరి మెట్రోలో సాగే ఈ మూడు వారాల షూటింగు ప్రేక్షకులను ఏ విధంగా ఆకట్టుకుంటుందో చూడాలి.

మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్ లో నవీన్ ఎర్నేని, వై రవిశంకర్ భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా 2026 డిసెంబర్ 3వ తేదీన ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇందులో మిథున్ చక్రవర్తి, జయప్రద, అనుపమ్ ఖేర్, భానుచందర్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. దేశభక్తి గాథకు, సాంప్రదాయానికి పెద్ద పీట వేసే చిత్రంగా ఈ చిత్రం రూపొందుతోంది. ఇకపోతే ఇటీవల పోస్టర్ ను విడుదల చేస్తూ.." అజ్ఞాత పర్వం ముగిసింది. తిరుగుబాటు మొదలైంది. ప్రపంచవ్యాప్తంగా 2026 డిసెంబర్ 3న ఘనంగా విడుదల కాబోతోంది" అంటూ పోస్టర్స్ విడుదల చేసిన విషయం తెలిసిందే.

ఇందులో ప్రభాస్ రక్తంతో తడిసిపోయి మెడలో జంధ్యం వేసుకొని చేతిలో రైఫిల్ పట్టుకొని ఒక రాయిపై కూర్చొని కనిపిస్తున్నారు. ఆయన చుట్టూ నేలపై అనేక మృతదేహాలు పడి ఉన్నాయి. ఒంటరిగా పోరాడే ఒక బెటాలియన్ అనే వాక్యం కూడా పోస్టర్ పై ఉండడం గమనార్హం. మొత్తానికి అయితే భారీ అంచనాల మధ్య ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఈ సినిమా ఎలాంటి రికార్డులు క్రియేట్ చేస్తుందో చూడాలి.



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at Dno 6-5-25, medara bazar, 16 th ward, near Oid bus stand, Bapatla editor GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2233, editorpenpower@gmail.com